శనివారం
09-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 257
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నాటో కూటమిలోకి స్వీడన్

స్టాక్‌హోమ్: నాటో కూటమిలో స్వీడన్ చేరింది. 32వ సభ్యదేశంగా నిలిచింది. తొలుత స్వీడన్‌కు సభ్యత్వం కల్పించేందుకు టర్కీ, హంగేరి అంగీకరించలేదు కానీ ఇటీవల రెండు దేశాలు ఆమోదం తెలిపాయి. దీంతో స్వీడన్‌కు నాటో కూటమిలో స్థానం దక్కింది. ఇది చరిత్రాత్మక రోజు అని స్వీడన్ ప్రధాని అన్నారు. కాగా, దశాబ్దాల తటస్థకు ముగింపు పలుకుతూ స్వీడన్ నాటోలో చేరింది. దీంతో అమెరికా, దాని మిత్ర దేశాలకు మరింత రక్షణ లభించినట్లు అయ్యిందని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. ఫిన్లాండ్ గతేడాదిలో నాటో సభ్యత్వం పొందడం తెలిసిందే.

వయనాడ్ నుంచే రాహుల్

39 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

తెలంగాణలో నాలుగు స్థానాల అభ్యర్థులు ఖరారు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సీట్ల కసరత్తును ముమ్మరం చేసింది. ఎనిమిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి 39 మంది అభ్యర్థులతో తొలి జాబితాను శుక్రవారం విడుదల చేసింది. కేరళకు చెందిన వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ రెండోసారి పోటీ చేయనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కె.సి.వేణుగోపాల్ కేరళలోని అలుప్పుజ నుంచి, ఇక సిట్టింగ్ ఎంపీ శశి థరూర్ వరుసగా నాల్గవ సారి తిరువనంతపురం నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి అయిన శశి థరూర్ 2009 నుంచి ఈ స్థానంలో గెలుస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ తొలి జాబితాలో జనరల్ విభాగం నుంచి 15 మంది అభ్యర్థులు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు) నుంచి 24 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఈ జాబితాను వెల్లడించిన కేసీ వేణుగోపాల్ తెలిపారు. చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ రాజ్‌నంద్‌గావ్ నుంచి, రాష్ట్రంలోని మహాసముంద్ స్థానం నుంచి మాజీ మంత్రి తామ్రధ్వజ్ సాహూ, కోర్బా నుంచి జోత్స్నా మహంత్ పోటీ చేయనున్నారు. అలాగే, తెలంగాణా రాష్ట్రంలో 18 లోక్‌సభ స్థానాలు ఉండగా, నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. జహీరాబాద్ నుంచి సురేశ్ కుమార్ షెట్కర్, నల్గొండ నుంచి కుందూరు రఘువీర్ రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి చల్లా వంశీ చంద్ రెడ్డి, మహబూబాబాద్ నుంచి పోరిక బలరాం నాయక్ ఉన్నారు. ఇదిలాఉండగా, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మొత్తం 60 లోక్‌సభ స్థానాలపై చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, కర్నాటక, కేరళ, చత్తీస్‌గఢ్, తెలంగాణ, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, లక్షద్వీప్‌ల్లో లోక్‌సభ స్థానాలపై కసరత్తు చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు వి.డి.సతీశన్

- మిగతా 2 లో

పొత్తు పొడిచింది

- ఆరేళ్ల తర్వాత మళ్లీ ఎన్డీఏలోకి టీడీపీ
- ఢిల్లీలోనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ మకాం
- బీజేపీ అగ్రనేతలతో సీట్ల కేటాయింపుపై చర్చలు
- ఎంపీ సీట్లపై కమలనాథుల పట్టు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఎట్టకేలకు అందరూ ఊహించినట్లుగానే బీజేపీతో టీడీపీ ఎన్నికల పొత్తు కుదుర్చుకుంది. దాదాపు ఆరేళ్ల తర్వాత నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్(ఎన్డీఏ) కూటమిలో తెలుగుదేశం పార్టీ మళ్లీ చేరబోతుంది. 2014 తర్వాత...వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ– బీజేపీతో కలిసి పోటీ చేయనుంది. ఆ ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రత్యక్షంగా పోటీ చేయలేదు. కేవలం బయట నుంచి మద్దతు మాత్రమే తెలియజేసింది. తొలుత 1999లో బీజేపీతో కలిసి పోటీ చేసిన చంద్రబాబు...రాష్ట్ర విభజన తర్వాత కూడా బీజేపీతో కలిసి ప్రయాణం చేశారు. 2014లో ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగా, బీజేపీ భాగస్వామిగా ఉంది. అలాగే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామ్యపక్షంగా వ్యవహరించింది. 2018లో రాష్ట్రానికి నిధులు, విభజన అంశాల అమలు విషయంలో టీడీపీ, బీజేపీ మధ్య విభేదాలు వచ్చాయి. ఆ సమయంలో కూటమి నుంచి టీడీపీ బయటకు వచ్చింది. 2019లో కేంద్రంలో ఎన్డీఏ మరోసారి విజయం సాధించగా, ఏపీలో వైసీపీ అనూహ్యమైన మెజార్టీతో గెలుపొందింది. ఆ తర్వాత టీడీపీ– బీజేపీ మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. మరలా ఆరేళ్ల తర్వాత రెండు పార్టీలు జనసేనతో కలిసి ప్రజల్లోకి వెళ్లబోతున్నాయి. ఇక ఎన్నికల పొత్తు, సీట్ల సర్దుబాట్లపై ఢిల్లీ పెద్దలతో చర్చించేందుకు గురువారం ఢిల్లీ చేరుకున్న టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీజేపీ అగ్ర నేతలు జేపీ నడ్డా, అమిత్‌షాలతో భేటీ అయ్యారు. గురువారం అర్థరాత్రి దాదాపు గంటన్నరపాటు సీట్ల

- మిగతా 2 లో

‘సర్వే’నే ప్రామాణికం

- పదికి చేరిన వైసీపీ జాబితాలు
- కొలిక్కి వచ్చిన నెల్లూరు, ఒంగోలు, మచిలీపట్నం
- మిగిలిన పార్లమెంటు స్థానాలపై కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తాజా రాజకీయ సమీకరణలు, సామాజిక బలాబలాల ఆధారంగా అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం ప్రకటిస్తోంది. ఆ తర్వాత నిలిపిన అభ్యర్థికి ఏ మాత్రం సర్వేలో అనుకూలత రాకుంటే వెంటనే మార్చేస్తోంది. తాజాగా శుక్రవారం రాత్రి 11వ జాబితాలో రాజోలు ఇన్‌చార్జ్‌గా గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్‌గా రాపాక వరప్రసాద్, కర్నూలు పార్లమెంటరీ ఇన్‌చార్జ్‌గా ఇన్‌చార్జ్‌గా బీవై రామయ్యలను నియమించింది.

ఈ నెల 7న వైసీపీ విడుదల చేసిన పదవ జాబితాలోనూ సర్వే ఆధారంగానే పేర్లు ప్రకటించింది. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు పేరును వెల్లడించింది. అవనిగడ్డ వైసీపీ ఇన్‌ఛార్జ్‌గా సిట్టింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబుకు తిరిగి బాధ్యతలు అప్పగించింది. అంతకుముందు జాబితాలో సింహాద్రి చంద్రశేఖర్‌రావును అవనిగడ్డ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, ఆయన నిరాకరించి, తన తనయుడికి బాధ్యతలు ఇవ్వాలని సీఎం జగన్‌ను కోరారు. దీంతో సింహాద్రి రమేశ్‌బాబును మచిలీపట్నం పార్లమెంటు ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అనంతరం వచ్చిన సర్వేల ఆధారంగా తిరిగి రమేశ్‌బాబును అవనిగడ్డకే నియమించారు. పార్లమెంటు అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. వైసీపీకి కీలకంగా మారిన కొన్ని పార్లమెంటు స్థానాలపై స్పష్టత వచ్చింది. తొలుత వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు, చేర్పులతో సిట్టింగ్ ఎంపీలైన వల్లభనేని బాలశౌరి (మచిలీపట్నం), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసారావుపేట), మాగుంట శ్రీనివాసులురెడ్డి (ఒంగోలు) కు టికెట్లు ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. దీంతోపాటు నెల్లూరు వైసీపీ అభ్యర్థిగా ఉన్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీని వీడి టీడీపీలో చేరడంతో ఆయా స్థానాలపై ఎంపీ అభ్యర్థుల ఎంపిక వైసీపీకి పెద్ద సమస్యగా మారింది. దీంతో వరుస వారీగా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. అన్నీ ఆలోచించి గెలుపే లక్ష్యంగా అక్కడ ఏకంగా వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డికి సీఎం జగన్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవలే ఆయన నెల్లూరుకు భారీ ర్యాలీగా వెళ్లి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి వైసీపీ టికెట్ నిరాకరించడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాగుంటకే ఎంపీ సీటు ఇవ్వాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి పట్టుపట్టినా ఫలితం లేదు. దీంతో సీఎంకు

- మిగతా 2 లో

రాజ్యసభకు సుధామూర్తి

ప్రధాని అభినందన

న్యూఢిల్లీ: ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమెను ఎగువ సభకు నామినేట్ చేసినట్లు ప్రధాని నరేంద్రమోదీ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. మహిళా దినోత్సవం రోజున ఈ ప్రకటన వెలువడటం విశేషం. అనేక రంగాల్లో సుధామూర్తి విశేష కృషిని ప్రధాని కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్యతో పాటు విభిన్న రంగాల్లో ఆమె చేసిన కృషి అపారం, స్ఫూర్తిదాయకమని మోదీ పేర్కొన్నారు. ఆమె రాజ్యసభకు నామినేట్ కావడం ‘నారీశక్తి’కి బలమైన నిదర్శనమని, దేశ

- మిగతా 2 లో

‘ఎస్‌బీఐ’ కేసులో

11న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించేందుకు మరింత గడువు కోరుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 11న సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని ఎస్‌బీఐకు కోర్టు 6వతేదీ వరకు గడువు ఇచ్చింది. కానీ ఆ తేదీలోగా వివరాలను ఎస్‌బీఐ వెల్లడించలేదు.

దాతల వివరాలు వెల్లడించేందుకు జూన్ 30 వరకు గడువును కోరింది. దీనిపై 11వ తేదీన అనగా సోమవారం సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టబోతోంది. కోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ ధిక్కరించినట్లు దాఖలైన పిటిషన్‌ను అదే రోజు విచారించనున్నది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం గతనెలలో

తీర్పుఇచ్చింది. వాటిని రద్దు చేయాలని ఆదేశాలిచ్చింది. 2019 ఏప్రిల్ 12 నుంచి కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను ఈనెల 6లోపు ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎస్‌బీఐకి... వాటిని ఈనెల 13వ తేదీ నాటికి

- మిగతా 2 లో

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

2లో

ఇదీ లోకం!

ఏంటీ.. ఎవరేపార్టీలోకి జంపవుతున్నారో అర్థంకావట్లేదా?
ఏ రాయయితేనేం మళ్లీ గెలిచేది అదే నాయకులు..కండువాలు ఛేంజ్ అంతే!

ఇంకా జైల్లో ఉన్నట్టే అనిపిస్తోంది

- నిర్దోషిగా విడుదల కావడాన్ని నమ్మలేకున్నా
- న్యాయవాది గాడ్లింగ్ విడుదలతోనే నాకు పూర్తి న్యాయం
- సాయిబాబా భావోద్వేగం

న్యూఢిల్లీ: ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఏడేళ్ల తర్వాత జైలు నుంచి విడుదలయ్యాయి. మావోయిస్టులతో సంబంధాల కేసులో సాయిబాబా నిర్దోషి అని బాంబే హైకోర్టు తేల్చింది. దీంతో గురువారం నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి ఆయన బయటకు వచ్చారు. ఇదే క్రమంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రాణాలతో జైలు నుంచి

బయటకు రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు సాయిబాబా చెప్పారు. జైలు జీవితాన్ని, తన కుటుంబ కష్టాలను వివరిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ‘ఏడేళ్లు కారాగారంలో ఉన్నా. బయటకు వచ్చినాగానీ ఇంకా జైల్లో ఉన్నట్లే అనిపిస్తోంది’ అని చెప్పారు. విడుదల అయ్యాయని నమ్మలేకపోతున్నట్లు తెలిపారు. ఇంకా నేరస్తుడిగా కారావాసంలో ఉన్నానన్న భావన కలుగుతోందన్నారు. అది అగ్ని పరీక్ష లాంటిదని, దానిని రెండుసార్లు ఎదుర్కొన్నానని సాయిబాబా అన్నారు. తన తరపు న్యాయవాదులకు

- మిగతా 2 లో

మత్స్యకారుల ఆత్మహత్యాయత్నం

- పైప్‌లైన్ తొలగించాలని డిమాండ్
- కాకినాడ జిల్లాలో బోట్లకు నిప్పంటించి నిరసన
- మత్స్య సంపద కనుమరుగవుతుందని ఆవేదన
- ‘అరబిందో’కు వ్యతిరేకంగా నినాదాలు



తమ జీవనోపాధిని దెబ్బతీసే పైప్‌లైన్లను తక్షణమే తొలగించాలంటూ మూడు రోజులుగా చేస్తున్న ఆందోళనతో విసిగివేసారిన మత్స్యకారులు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు.

2లో

వంటగ్యాస్ సిలిండర్ ధర

రూ.100 తగ్గింపు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహిళలను ఆకట్టుకునేందుకు ప్రధాని నరేంద్రమోదీ మరో తాయిలం ప్రకటించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గిస్తున్నట్లు శుక్రవారం మోదీ ప్రకటించారు. తద్వారా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ ప్రకటన వెలువడడం రాజకీయ లబ్ధి కోసమేనని విపక్షాలు విమర్శించాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ.803కి చేరనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈరోజు అర్ధరాత్రి నుంచే కొత్త ధరలు

- మిగతా 2 లో

యూరప్‌లో ప్యారట్ ఫీవర్

ఐదుగురి మృతి



బ్రసెల్స్: యూరప్ దేశాలను ప్యారట్ ఫీవర్ వణికిస్తోంది. ఇప్పటికే ఐదుగురు ఈ వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ప్యారట్ ఫీవర్ సోకిన వారికి శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయి. తీవ్ర జ్వరం, తలనొప్పి, పొడి దగ్గు, కండరాల నొప్పులు బాధిస్తున్నాయి. ఇప్పటికే ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్‌లో ఈ కేసులు పెరిగాయి. ఇన్ఫెక్షన్‌కు గురైన పక్షుల ద్వారా మనుషులకు ఈ వైరస్ ప్రబలుతోంది. క్లామిడోఫిలా సిటాసి అనే బ్యాక్టీరియా ఇందుకు కారణం. పౌల్ట్రీ, వెటరినరీ విభాగాల్లో పనిచేసేవారు, పక్షులు పెంచుకొనేవారు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన 5 నుంచి14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయట పడుతున్నాయి. ఇప్పటికే ఐదుగురు చనిపోవడంతో యూరప్ ప్రజల భయపడుతున్నారు.

మహిళల విముక్తి కోసం పోరు ఉధృతం

యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ పిలుపు

బ్రసెల్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల విముక్తి కోసం పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ (ఈసీఏ) పిలుపునిచ్చింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ), పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించింది. 'శ్రామిక మహిళలకు విముక్తి కల్పించే ప్రక్రియను ఇంటర్నేషనల్ వర్కింగ్ ఉమెన్స్ డే ఓ సూచిక. వర్గపోరునకు ఇది వేరు కాదు. మహిళలు అనుభవించే అసమానత్వం, లింగ-పని వివక్షపై పోరునకు సంకేతం. దీనిని మనం జీవించే పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి వేరు చేయలేం' అని యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ (ఈసీఏ) ప్రకటన పేర్కొంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల పరిరక్షణ కోసం పిలుపునిచ్చింది. 1917లో గ్రేట్ అక్టోబర్ సోషలిస్ట్ విప్లవం ద్వారా మహిళలకు కీలక హక్కులు లభించాయని గుర్తుచేసింది. సమానత్వం, విడాకులు పొందడం. స్వేచ్ఛా జీవితం, న్యాయబద్ధంగా గర్భవిచ్ఛిత్తికి హక్కులు వచ్చాయని తెలిపింది. పనిచేసే మహిళలు అనేక రకాలుగా వివక్షను ఎదుర్కొంటున్నట్లు గుర్తుచేసింది. వేతనాల్లో వ్యత్యాసం, పని భద్రత లేకపోవడం, నియామకాల్లో అసమానతలు, మెటర్నిటీ, మేనోపాస్ కారణంగా వివక్షకు గురవుతున్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేసింది. కుటుంబ సంరక్షణ, పిల్లల బాగోగుల బాధ్యతనూ మహిళలు మోస్తున్నారని పేర్కొంది. 'వివక్ష, లైంగిక వేధింపులు, హింస, పని ప్రదేశాల్లో అభద్రత, కుటుంబ సమస్యల వంటివి మహిళలను మానసికంగానే కాకుండా భౌతికంగానూ కుంగతీస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వారి మరణానికి దారితీస్తున్నాయి. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ వేధింపుల నుంచి తప్పించుకునేందుకు మహిళలకు పెద్దగా అవకాశం ఉండటంలేదు. ఇటీవల కాలంలో పరిస్థితి మరింత దిగజారింది. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల వల్ల మహిళల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. వారి మనుగడ కష్టసాధ్యంగా మారుతోంది. కార్మిక సంఘాల్లో మహిళా భాగస్వామ్యాన్ని, సామాజిక, రాజకీయ జీవనశైలినీ దెబ్బతీస్తోంది. లింగ-పని వివక్ష సవాల్‌గా మారింది. లైంగిక వేధింపులు, హింస పేట్రేగిపోతోంది. వీటి నియంత్రణకు పోరాటం తప్పదు' అని యూరోపియన్ కమ్యూనిస్ట్ యాక్షన్ (ఈసీఏ) ప్రకటన పేర్కొంది.

కాల్పుల విరమణపై నేడు కైరోలో హమాస్ చర్చలు

జెరూసలేం: గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ కోసం చర్చలకుగాను హమాస్ ప్రతినిధి బృందం శనివారం ఈజిప్టు రాజధాని కైరోకు వెళ్లనున్నట్లు ది వాల్ స్ట్రీట్ జర్నల్ శుక్రవారం నివేదించింది. కాల్పుల విరమణకు సంబంధించి ఇజ్రాయిల్‌తో చర్చల్లో ప్రతిష్టంభన కొనసాగుతోందని, యూద దేశం కాల యాపన చేస్తోందని హమాస్ రాజకీయ కార్యాలయ సభ్యుడు హుసమ్ బద్రాన్ చెప్పినట్టు స్పుట్నిక్ పేర్కొంది.

శాశ్వత కాల్పుల విరమణ కోసం గాజా స్ట్రిప్‌లో హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ డిమాండ్ చేశారు. అయితే ఈ విషయంలో హమాస్ నేతల మధ్య ఏకాభిప్రాయం లేదని, ఆరు వారాల విరామానికి అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2023 అక్టోబరు 7 నుంచి హమాస్, ఇజ్రాయిల్ మధ్య పోరు కొనసాగుతోంది. ఇప్పటివరకు 30,800 మంది చనిపోయారు. నవంబరు 27న ఖతార్ మధ్యవర్తిత్వం క్రమంలో తాత్కాలిక విరామం సాధ్యమైంది. హమాస్, ఇజ్రాయిల్ తమ వద్ద ఉన్న బందీల్లో కొందరిని తిరిగి అప్పగించేశారు. మానవతా సాయం గాజా స్ట్రిప్‌కు చేరింది. డిసెంబరు ఒకటో తేదీలో విరామం ముగిసింది. ఇంకా 100 మంది హమాస్ వద్ద బందీలుగా ఉన్నట్లు సమాచారం.

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)కి సిద్ధమవుతున్న ఓ విద్యార్థి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన అభిషేక్ కుమార్ కోటాలోని విజ్ఞాన్ నగర్‌లో తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఏడాదిలో ఇది ఆరో ఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అభిషేక్ విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. 'సారీ నాన్నా... నేను జేఈఈ చేయలేను' అని తన తండ్రిని ఉద్దేశించి రాసిన సూసైడ్ నోట్ గదిలో లభ్యమైంది. కోచింగ్ సెంటర్‌లో జనవరి 29, ఫిబ్రవరి 19న జరిగిన రెండు పరీక్షలకు అభిషేక్ హాజరుకాలేదని పోలీసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో జిల్లా యంత్రాంగం కౌన్సెలింగ్ సౌకర్యాలు అందించడానికి, కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆత్మహత్యలు ఆగట్లేదు. గత ఏడాది 26 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడగా ఈ సంవత్సరం మొదటి మూడు నెలల్లోనే అరడజను కేసులు నమోదవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవడంతో కేంద్రం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా శిక్షణ ఇవ్వాలని సూచించింది. అటు విద్యార్థుల మరణాలను నియంత్రించేందుకు భవనాల చుట్టూ ఇనుప వలలు, గదుల లోపల స్ప్రింగ్ ఫ్యాన్లు అమర్చారు. అయినప్పటికీ ఇవి ఆగకపోవడం కలవరపెడుతోంది.

మత్స్యకారుల ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-యు.కొత్తపల్లి: తమ జీవనోపాధిని దెబ్బతీసే పైప్‌లైన్లను తక్షణమే తొలగించాలంటూ మూడు రోజులుగా చేస్తున్న ఆందోళనతో విసిగివేసారిన మత్స్యకారులు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. తమ బోట్లకు తామే నిప్పుపెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కోనపాపపేటలో వందలాది మత్స్యకార కుటుంబాలు కాకినాడ-అద్దరిపేట రహదారిపై బైఠాయించి 'అరబిందో'కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం వల్లనే తిరిగి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జిల్లా తొండంగి మండలం కోనపాపపేటలో నిర్మిస్తున్న అరబిందో ఫార్మా కంపెనీ సముద్రంలోకి పైప్‌లైన్ వేయడంతో మూడు రోజులుగా బీచ్ రోడ్‌లో భారీస్థాయిలో మత్స్యకారులు ధర్నా చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నేతల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేశారు. సుమారు ఎనిమిది వేల మంది మత్స్యకారులు బీచ్ రోడ్డుపై బైఠాయించారు. కోపోద్రిక్తులైన ఆందోళనకారులు తమ బోట్లుకు తామే నిప్పంటించుకొని నిరసన తెలియజేశారు. పైప్‌లైన్ తక్షణమే తొలగించాలంటూ మరికొందరు మత్స్యకారులు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. పైప్‌లైన్ వలన వ్యర్థాలు సముద్రంలోకి చేరి మత్స్య సంపద కనుమరుగై పోతుందని మండిపడ్డారు. వేటకు వెళితే బోట్లు ధ్వంసం అవుతాయని, వలలు చిరిగిపోతాయని, మత్స్య సంపద లభించక ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధర్నాలు చేపడితే పైప్‌లైన్ తొలగిస్తామని అధికారుల హామీ ఇచ్చారనీ, కానీ ఇప్పటికీ పైపులైన్లు తీయించలేదని వాపోయారు. హామీలు తుంగలో తొక్కడం వల్లనే తిరిగి ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు.

రెండు, మూడు రోజుల్లో పైపులైను తొలగిస్తామని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. కొందరు మత్స్యకార మహిళలు సైతం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆందోళన చేపట్టడంతో తీవ్ర ఉధృత పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు వారిని అడ్డుకున్నారు. ఏక్షణంలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. బీచ్ రోడ్డుపైనే టెంట్లు వేసుకుని సాయంత్రం వరకు తీవ్రస్థాయిలో ఉద్యమించారు. రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రూ.100 తగ్గింపు

(మొదటిపేజీ తరువాయి)

అమల్లోకి వస్తాయని తెలిపాయి. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. అంతర్జాతీయ ధరలు దిగొచ్చినందున దేశీయంగా తగ్గింపు సాధ్యమైందని ప్రభుత్వ వర్గాలు నమ్మబలికాయి. పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులేదు. గత 23 నెలలుగా అవి స్థిరంగా కొనసాగుతున్నాయి. 'ఈరోజు మహిళా దినోత్సవం సందర్భంగా మా ప్రభుత్వం ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.100 తగ్గించాలని నిర్ణయించింది. దీనివల్ల దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుంది. ముఖ్యంగా 'నారీశక్తి'కి ప్రయోజనం చేకూరుతుంది' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గత ఆరు నెలల్లో వంట గ్యాస్ ధర తగ్గించడం ఇది రెండోసారి. గతేడాది ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కో సిలిండర్‌పై కేంద్రం రూ.200 కుదించింది. దీంతో 14.2 కిలోల సిలిండర్ ధర రూ.1,103 నుంచి రూ.903కు దిగొచ్చింది. తాజాగా మరో రూ.100 తగ్గించటంతో అది రూ.803కు చేరింది. 'ఢిల్లీలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద రూ.300 రాయితీ పొందుతున్న వారికి సిలిండర్ రూ.503కే లభించనుంది. మిగతావారు దీన్ని రూ.803కు పొందొచ్చు' అని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. ప్రధాని అధ్యక్షతన గురువారం భేటీ అయిన కేంద్ర కేబినెట్ ఉజ్వల రాయితీని 2025 మార్చి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 2023 అక్టోబర్‌లోనే ప్రభుత్వం ఈ సబ్సిడీని రూ.200 నుంచి రూ.300కు పెంచింది. గతకొన్నేళ్లలో గణనీయంగా పెరిగిన గ్యాస్ ధరలు ఎన్నికల ప్రచారంలో కీలకాంశంగా మారనున్న నేపథ్యంలో ప్రజల ఆగ్రహాన్ని కొంత మేరకైనా చల్లార్చడానికి మోదీ సర్కారు రూ.100 తగ్గించింది. 2021 జులై నుంచి 2023 ఆగస్టు మధ్య 14.2 కిలోల సిలిండర్ ధర రూ.294 పెరిగింది. అధికార పార్టీపై ప్రతిపక్ష కాంగ్రెస్ విమర్శలకు దీన్ని అస్త్రంగా మార్చుకుంది.

'సర్వే'నే ప్రామాణికం

(మొదటిపేజీ తరువాయి)

విధేయుడిగా ఉన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఒంగోలు ఎంపీగా బరిలోకి దింపారు. నరసారావుపేట సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను గుంటూరు ఎంపీగా వెళ్లాలని అధిష్ఠానం కోరగా, అందుకు ఆయన నిరాకరించారు. దీంతో నరసారావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన నెల్లూరు ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ పేరును ప్రతిపాదించారు. కీలకంగా ఉన్న ఎంపీలపై స్పష్టత రాగా, మరికొన్ని స్థానాలపై బలమైన అభ్యర్థుల కోసం వైసీపీ పరిశీలిస్తోంది.

మంత్రి పెద్దిరెడ్డికి అదనపు బాధ్యతలు

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పార్టీలో అదనపు బాధ్యతలను వైసీపీ అధిష్ఠానం అప్పగించింది. పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పెద్దిరెడ్డిని అనంతపురం, హిందూపురం, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలతో పాటు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పలస్తీనా ప్రజల కష్టాలపై సందర్శకుల కంటతడి

ఏఐటీయూసీ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు

న్యూఢిల్లీ : పాలస్తీనా ప్రజలు గాజా యుద్ధ ప్రాంతంలో పడుతున్న కష్టాలు, ఎదుర్కొంటున్న హింసాత్మక చర్యలను కళ్లకుకడుతూ ఓ ఫొటో ఎగ్జిబిషన్‌ను న్యూఢిల్లీలో ఏఐటీయూసీ, ప్రగతిశీల రచయితల సంఘం (పీడబ్ల్యుఏ) సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. డీడీయూ మార్గ్‌లో ఉన్న ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను న్యూఢిల్లీలో పనిచేసే పలస్తీనా రాజ్య దౌత్యవేత్త అద్నాన్ అబు అల్ హైజా ప్రారంభించారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ఈ ప్రారంభ సభకు అధ్యక్షత వహించారు. పీడబ్ల్యుఏ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అర్జెండ్ అరా, ఫొటో ఎగ్జిబిషన్ కీలక సూత్రధారి జగదీశ్ చంద్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. ఈనెల 18 వరకూ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. దీనిలో ప్రదర్శించిన చిత్రాలు చూసి సందర్శకులు కంటతడిపెట్టారు. హృదయాలు ద్రవింపజేసేవిధంగా ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న అరాచకాలు, వారికి బలైపోయిన అమాయక ప్రజలు పడుతున్న కష్టాలను ఈ చిత్రాల్లో కళ్లకు కట్టారు. అద్నాన్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా మరణిస్తున్న పాలస్తీనా ప్రజలు ఎంతమందో ఆ గణాంకాలను తిరిగి సేకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇజ్రాయెల్ సైన్యం గాజాలో స్త్రీలు, పిల్లలపై దారుణమైన అత్యాచారాలు, అరాచకాలకు పాల్పడిందని ఐక్యరాజ్యసమితి భయసందేహాలు వ్యక్తం చేస్తున్న తరుణంలో అద్నాన్ పైవిధంగా స్పందించారు. అమాయకులైన సామాన్య ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం అమానుషంగా చంపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా ప్రాంతంలో జరుగుతున్న అత్యంత క్రూరమైన హింసాకాండను వెలుగులోకి తెచ్చి ప్రజల్లో ప్రచారం చేస్తున్నందుకు ఏఐటీయూసీ, పీడబ్ల్యుఏకు అద్నాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రపంచ ప్రజలు ముక్తకంఠంతో ఈ దారుణాలను ఖండిస్తున్నాగానీ ఇజ్రాయెల్‌తో పాటు దాన్ని మిత్రదేశాలు సిగ్గులేకుండా సమర్థిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఐక్యరాజ్యసమితి... యుద్ధం ఆపాలనీ, మానవతా సహాయం చేయాలని తీర్మానం చేసిందనీ, అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఆదేశాలు జారీచేసినాగానీ నిస్సిగ్గుగా గాజాలో దారుణాలు కొనసాగిస్తున్నారని అద్నాన్ విమర్శించారు. పాలస్తీనా దారుణాలను ప్రతిబింబింపజేసేలా చిన్నచిన్న ఘట్టాలను ప్రదర్శించారు. పద్యాలు పాడారు. కళ్లకుకట్టేలా ప్రదర్శించిన ఈ ఘట్టాలు చూసి పలువురి కళ్లు చెమర్చాయి.

చరిత్రను వక్రీకరిస్తున్న కేంద్రం: అమర్జీత్ కౌర్

పలస్తీనా చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈనాటి యువతరాన్ని తప్పుదోవ పట్టించేలా పైపై విశ్లేషణలను వివరిస్తోందని అమర్జీత్ కౌర్ అన్నారు. యువతరం వాస్తవాలు తెలుసుకోవడం కోసమే ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని, ఇది కేవలం ఒక్కరోజుతో ముగిసే ఫొటో ఎగ్జిబిషన్ కాదనీ, యువతరం ఒక తెరిచిన పుస్తకంలాంటి ఈ ఎగ్జిబిషన్ ద్వారా అనుభవాలను గ్రహించి సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. గాజాలో జరుగుతున్న దురాగతాలు, కేంద్ర వైఖరి ఎక్కువమందికి తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 16,17 తేదీలలో ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతోందని, దేశ వ్యాప్తంగా వచ్చే కార్మిక ప్రతినిధులు కూడా ఈ ప్రదర్శనను చూస్తారని, దీనికి విస్తృత ప్రచారం జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదర్శనను వివిధ రాష్ట్రాలలో కూడా ఏర్పాటు చేస్తామని కౌర్ చెప్పారు. ప్రపంచ మానవాళి చరిత్రలో అత్యంత కిరాతకమైన సామూహిక ఊచకోతల దుర్మార్గం గాజాలో ఇజ్రాయెల్ సైన్యం కొనసాగిస్తోందని ఆమె విమర్శించారు. సామ్రాజ్యవాదుల చేతుల్లో బలైపోతున్న పలస్తీనా ప్రజలకు స్వాతంత్ర్యానికి ముందు, అనంతర కాలంలో కూడా భారతదేశ ప్రజలు సంఘీభావం ప్రకటించిన గొప్ప వారసత్వ చరిత్ర మనకు ఉందని గుర్తుచేశారు.

భారత యువతను ఇజ్రాయెల్‌కు పంపొద్దు
ఏఐటీయూసీ సెక్రటేరియట్ డిమాండ్

యుద్ధం జరుగుతున్న గాజా ప్రాంతంలో కార్మికులుగా పనులు చేయడానికి భారతదేశ యువకులను పంపించవద్దని ఏఐటీయూసీ సెక్రటేరియట్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో చేసుకున్న కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేయాలని కూడా కోరింది. ఇజ్రాయెల్ సరిహద్దుల్లో పలస్తీనా కార్మికులకు బదులుగా వారిస్థానంలో యుద్ధం జరిగే ప్రాంతంలో భారతీయ యువకులను పంపిస్తున్నారని పేర్కొంది. "బుధవారంనాటి పత్రికల్లో వెలువడిన ఒక వార్త కలచివేసింది. ఇజ్రాయెల్- లెబనాన్ సరిహద్దుల్లో కేరళకు చెందిన ఓ యువకుడు క్రూరమైన దాడుల్లో మరణించాడు. భారత యువకులను యుద్ధ ప్రాంతమైన ఇజ్రాయెల్‌కు పలస్తీనా నిర్మాణరంగ కార్మికులస్థానంలో పనులు చేయడం కోసం పంపించవద్దు" అని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పొరుగున అరబ్ దేశాలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేస్తున్న ఘాతుకాల కారణంగా ఆ ప్రాంతమంతా యుద్ధమండలంగా మారిపోయిందని పేర్కొంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం కారణంగా దానిని అరికట్టడానికి బదులుగా నిర్దాక్షిణ్యంగా మొండితనంతో కేంద్ర ప్రభుత్వం మన యువకులను యుద్ధ మండలానికి పంపిం చడాన్ని ఖండించింది.

ఇంకా జైల్లో ఉన్నట్టే అనిపిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

కృతజ్ఞతలు తెలిపారు. ఓ న్యాయవాది ఫీజు తీసుకోకుండా తన కేసు వాదించారని చెప్పారు. తనకు మద్దతిచ్చిన కారణంగా మరొక న్యాయవాదికి శిక్ష పడిందన్నారు. విచారణ సమయంలో కొందరు పోలీసులు తన తరపు న్యాయవాదులను బెదిరించారని సాయిబాబా ఆరోపించారు. కేవలం ఆశతోనే జీవించి ఉన్నా... ఇప్పుడు కూడా ఆసుపత్రికి వెళ్లకుండా మీడియాతో మాట్లాడేందుకు వచ్చా. మీరంతా నాకు మద్దతిచ్చారు. నా కుటుంబం తీవ్ర వివక్షను ఎదుర్కొన్నది. నన్ను ఉగ్రవాది అన్నారు' అని సాయిబాబా భావోద్వేగంగా మాట్లాడారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. 90శాతం దివ్యాంగుడైన సాయిబాబు సొంతంగా ఏ పని చేసుకోలేరు. టాయిలెట్‌కు వెళ్లాలన్నా, స్నానం చేయాలన్నా ఒకరి సాయం అవసరం. అలాంటిది ఎలాంటి ఉపశమనం లేకుండా దీర్ఘకాలం జైల్లో ఉన్నారు. నాగపూర్‌కు చెందిన మానవహక్కుల కార్యకర్త, న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్... ఎల్గార్ పరిషత్ కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్నారు. తన కేసును వాదించినందుకే గాడ్లింగ్‌ను శిక్షించారని సాయిబాబా తెలిపారు. 'వేలాది మంది దళితులు, ఆదివాసీలకు న్యాయం కోసం పోరాడిన న్యాయవాది ఇప్పుడు జైల్లో ఉన్నారు. నా కేసులో పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే ఆయనను విడుదల చేయాలి' అని సాయిబాబా అన్నారు. తన కేసులో తీర్పును పూర్తిగా చదివే అవకాశం లభించలేదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్ర నుంచి పరిహారాన్ని చట్టప్రకారం డిమాండ్ చేస్తారా అని ఒక విలేకరి అడిగితే దాని గురించి ఆలోచించలేదు. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగోలేదు' అని సాయిబాబా చెప్పారు. జైల్లో సరైన వైద్యసంరక్షణ లేకపోవడంతో సహ నిందితుడు నరోటే చనిపోయినట్లు తెలిపారు. కాగా, 2017, మార్చి 7న గడ్చిరోలి (మహారాష్ట్ర)లోని స్థానిక కోర్టు సాయిబాబాతో పాటు ప్రశాంత్ రాహి, మహేశ్ టిర్కీ, హేమ్ క్షేవ్‌దత్తా మిశ్రా, పాండు నరోటేకు యావజ్జీవం విధించింది. ఆరవ నిందితుడు విజయ్ నాన్ టిర్కీకి పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. నరోటే జైల్లో ఉండగా తీవ్ర అనారోగ్యానికి గురై 2022, ఆగస్టులో చనిపోయారు. ఆయన వయస్సు 33 ఏళ్లు. స్వైన్‌ఫ్లూ సోకిన క్రమంలో ఆరోగ్యం క్షీణించి ఆయన ప్రాణాలు విడిచారు. అయితే నరోటే మరణానికి జైలు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆయన తరపు న్యాయవాదులు, కుటుంబ సభ్యులు నిందించారు.

రాజ్యసభకు సుధామూర్తి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణంలో మన మహిళల శక్తి సామర్థ్యాలను చాటిచెప్పడానికి చక్కటి ఉదాహరణ అని అభిప్రాయపడ్డారు. ఆమె పార్లమెంటరీ పదవీకాలం ఫలప్రదమవ్వాలని మోదీ ఆకాంక్షించారు. కాగా, రాజ్యసభకు నామినేట్ అవడంపై సుధామూర్తి ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ఆమె పీటీఐతో ఫోన్‌లో మాట్లాడారు. మహిళా దినోత్సవం రోజున ఈ ప్రకటన రావడం ఆశ్చర్యంగా ఉందని, చాలా ఆనందంగా ఉందని, ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. నిజానికి తనకు ఆశ్చర్యంగా ఉందని, తాను ఏనాడూ పదవులు కోరుకోలేదని తెలిపారు. ప్రభుత్వం తనను ఎందుకు ఎంపిక చేసిందో తెలియదని, అయితే, దేశానికి సేవ చేసేందుకు ఇదో కొత్త బాధ్యత అని నమ్ముతున్నానని ఆమె చెప్పారు. 73 ఏళ్ల సుధామూర్తి ప్రస్తుతం 'మూర్తి ట్రస్ట్'కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2006లో కేంద్రం పద్మశ్రీ, 2023లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

వయనాడ్ నుంచే రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ కేరళలో 16 స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని, అలాగే మరో నాలుగు స్థానాల్లో తమ మిత్రపక్షాలు పోటీ చేస్తాయని తెలిపారు. 'ఈ 16 స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనే దానిపై సీఈసీ ఒక నిర్ణయం తీసుకుంటుంది. ఏఐసీసీ శనివారం అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తుంది' అని సతీశన్ అన్నారు. కాగా రాహుల్ గాంధీని కేరళలోని వయనాడ్ స్థానం నుంచి తిరిగి పోటీ చేయాలని డిమాండ్ వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఏఐసీసీ ఢిల్లీ ఇన్‌ఛార్జ్ దీపక్ బబారియా మాట్లాడుతూ ఢిల్లీలో పార్టీ పోటీ చేసే మూడు స్థానాల్లో అభ్యర్థుల కోసం ప్రాథమిక చర్చ జరిగిందని, మిగిలిన నాలుగు స్థానాల్లో 'ఇండియా కూటమి' భాగస్వామి ఆప్ పోటీ చేస్తుందని తెలిపారు. ఢిల్లీ సీట్లపై మార్చి 11న మరోసారి చర్చించనున్నామన్నారు. చత్తీస్‌గఢ్ మాజీ ఉప ముఖ్యమంత్రి టి.ఎస్.సింగ్ దేవ్ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని కాంగ్రెస్ వర్గాలు వివరించాయి. ఈ సీఈసీ సమావేశానికి ఖర్గేతో పాటు పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, వేణుగోపాల్, ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు. గతవారం బీజేపీ లోక్‌సభ ఎన్నికల కోసం 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. రాహుల్ గాంధీ అమేథీ నుంచి, గతంలో సోనియా గాంధీ పోటీ చేసిన రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేయవచ్చు. ఈ రెండు స్థానాలు గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా పరిగణించబడుతున్నాయి. కాంగ్రెస్ మొదటి కుటుంబానికి చెందిన ఇద్దరు వారసులు అక్కడ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ స్థానిక శాఖలు కోరుతున్నాయి. గతంలో అమేథీ నుంచి ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ 2019లో ఓడిపోయినా కేరళలోని వయనాడ్ నుంచి గెలిచారు. కాంగ్రెస్‌లోని అనేక రాష్ట్ర శాఖలు ఇప్పటికే తమ తమ స్క్రీనింగ్ కమిటీల సమావేశాలను నిర్వహించి, తమ రాష్ట్రాల్లో సంభావ్య అభ్యర్థుల జాబితాను పంపించాయి. సీఈసీ ఇతర సభ్యులుగా అంబికా సోని, అధిర్ రంజన్ చౌదరి, టి.ఎస్.సింగ్‌దేవ్, మహమ్మద్ జావేద్ ఉన్నారు.

పొత్తు పొడిచింది

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య, ఏఏ నియోజకర్గాలు కేటాయించాలన్నదానిపై సుదీర్ఘ చర్చలు సాగాయి. బీజేపీ అగ్రనేతలు ఎంపీ సీట్లు అధికంగా కోరుతుండగా, దానివల్ల ప్రత్యర్థి పార్టీ లాభపడే అవకాశం ఉందని చంద్రబాబు విశ్లేషించి వారికి వివరించినట్లు తెలిసింది. ఏపీ నుంచి పోటీచేసే ఎంపీ అభ్యర్థులు ఎవరెవరు? ఏ ఏ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని వారు ఆశిస్తున్నారు? ఆయా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులెవరు? వారిని బీజేపీ అభ్యర్థులు ఢీకొనగలరా? తదితర అంశాలు వారి మధ్య చర్చకొచ్చినట్లు తెలిసింది. అయితే సీట్ల సంఖ్యపై రెండు పార్టీల మధ్య స్పష్టత రాకపోవడంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీలోనే మకాం వేశారు. పోటీ చేసే స్థానాల గురించి సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ- జనసేన మధ్య సీట్ల సర్దుబాటు జరిగింది. జనసేనకు 3 ఎంపీ సీట్లు, 24 అసెంబ్లీ స్థానాలు కేటాయించగా, 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను జనసేన ప్రకటించింది. 94 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను టీడీపీ ప్రకటించింది. ఎంపీ అభ్యర్థులను మాత్రం టీడీపీ, జనసేన ఇంతవరకు ప్రకటించలేదు. బీజేపీ కోరుకునే స్థానాలు ఖాయమైన తర్వాతే మలి జాబితా విడుదల చేయాలని చంద్రబాబు, పవన్ నిర్ణయించారు. 9 అసెంబ్లీ, 7 లోక్‌సభ సీట్లను బీజేపీ గట్టిగా అడుగుతున్నట్లు తెలుస్తోంది.

శ్రీకాళహస్తి, జమ్మలమడుగు, కైకలూరు, ధర్మవరం, విశాఖ (నార్త్), ఏలూరు, రాజమండ్రి, అరకు, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ స్థానాలతోపాటు తిరుపతి, రాజంపేట, రాజమండ్రి, అరకు, నరసాపురం, విశాఖ లేదా విజయవాడ లోక్‌సభ సీట్లను బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. చంద్రబాబు మాత్రం 6 అసెంబ్లీ స్థానాలు, నాలుగు లేదా ఐదు పార్లమెంటు స్థానాలు కేటాయించడానికి సుముఖంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. శుక్రవారం రాత్రి అమిత్‌షా, నడ్డాలతో దీనిపై మరోసారి చర్చలు జరపాలని ప్రయత్నించినప్పటికీ అవకాశం దక్కకపోవడంతో భేటీ శనివారానికి వాయిదా పడింది. అమిత్ షా శనివారం పాట్నా వెళ్లే ముందు చంద్రబాబు కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 10వ తేదీన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థులను ప్రకటించనుంది. ఆ లోపు టీడీపీ జనసేనతో బీజేపీ సీట్ల సర్దుబాటు వ్యవహారం ఖరారయ్యే అవకాశం ఉందని, రేపో, మాపో టీడీపీ ఎన్డీఏ కూటమిలో చేరినట్లు అధికారిక ప్రకటన రానుందని ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మీడియాకు తెలిపారు.

బీహార్ శాసనమండలి బరిలో మళ్లీ రాబ్డీ దేవి

పాట్నా: బీహార్ శాసనమండలి అభ్యర్థిగా మరోమారు రాబ్డీ దేవిని నిలబెట్టాలని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్ఎల్‌డీ) శుక్రవారం నిర్ణయించింది. ఈనెలాఖరులో జరగబోయే ఎన్నికల్లో (రెండేళ్లకొకసారి జరిగేవి) సీపీఐ(ఎంఎల్) తరపున శశియాదవ్ కూడా పోటీ చేయనున్నారు. మొత్తం నలుగురిని బరిలో నిలపనున్నట్లు ఆర్ఎల్‌డీ ప్రకటన పేర్కొంది. పార్టీ అభ్యర్థుల్లో సీనియర్ నేతలు అబ్దుల్ బారీ సిద్దీఖీ, సయ్యద్ ఫైజల్ అలీ, ఉర్మిళ ఠాకూర్ ఉన్నారు. అభ్యర్థులందరూ సోమవారం నామినేషన్లు దాఖలు చేస్తారని పార్టీ అధికారి తెలిపారు. శాసనమండలికి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. ఈసారి 11 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. సిట్టింగ్ సభ్యుల పదవీ కాలం మేలో ముగియనుంది. కాగా, ఎన్డీయే తరపున నితీశ్ కుమార్ (జేడీయూ), ఖాలిద్ అన్వర్ (జేడీయూ), సంతోశ్ సుమన్ (హెచ్ఏఎం) తమ నామినేషన్లను ఇప్పటికే దాఖలు చేశారు.

11న సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి ఆదేశాలు జారీచేసింది. ఈనేపథ్యంలో బాండ్ల వివరాలను వెల్లడించేందుకు జూన్ 30 వరకు గడువు కావాలని సుప్రీంకోర్టును ఎస్‌బీఐ కోరింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్).. ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించడంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పాటించలేదని, తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు దాతల వివరాలు, విరాళాల మొత్తాన్ని ప్రజలకు వెల్లడించరాదనే ఎస్‌బీఐ గడువు కోరుతున్నట్లు ఆరోపించింది.

అత్యాచార దోషులకు కఠిన శిక్షలు

దుర్గాభవాని డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: మహిళలపై అత్యాచారాలు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర పాలకులు చోద్యం చూస్తున్నారే తప్ప కఠిన శిక్షలు అమలు చేయడం లేదని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని ధ్వజమెత్తారు. మహిళలపై చేయి వేయాలన్నా భయపడేలా కఠిన చట్టాలు తీసుకువచ్చి అత్యాచారాలకు ఒడిగట్టే వారికి కఠినంగా శిక్షలు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ గుంటూరు జిల్లా మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయం ఎదురుగా ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జెండాను దుర్గాభవాని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు కె.లలిత పద్మిని అధ్యక్షతన సభ నిర్వహించారు. దుర్గాభవాని మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టడంలో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. హోం మంత్రిగా మహిళలు ఉన్నప్పటికీ, దిశ వంటి చట్టాలు ఎన్ని తీసుకువచ్చినా మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం మద్యాన్ని నిషేధిస్తానని చెప్పి మద్యాన్ని ఏరులై పారిస్తోందని విమర్శించారు. ఆడపిల్లలపై అత్యాచారాలు జరిగితే గన్ కన్నా ముందు జగన్ ఉంటాడని చెప్పి ప్రగల్భాలు పలికిన మహిళా మంత్రులు ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళల రక్షణ కోసం ఎన్ని కొత్త చట్టాలు వచ్చినా ఆడబిడ్డలను కాపాడలేని ఈ బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మనువాద రాజకీయాలను ప్రతిఘటించాలని, పోరాడి సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకోవాలని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. నియోజకవర్గ మహిళా నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానికి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి జి.శివకుమారి, పట్టణ అధ్యక్షురాలు చిన్ని శివమ్మ, చిన్ని విజయలక్ష్మి, కె.సుకన్య, వి.మరియమ్మ, దాసరి బేబీ, ఎం.ఉమా, కె.శివలీల, డి.పద్మావతి, జాలాది ధనలక్ష్మి, జాలాది స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ నాయకులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, మరియదాసు మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

సృష్టికి మూలం మహిళలు

సీఎం జగన్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సృష్టికి మూలం మహిళలు అని, అలాంటి అక్కాచెల్లెమ్మలకు తమ ప్రభుత్వంలో అత్యున్నత పదవులు కల్పించామని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజ, కుటుంబ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న ప్రతి అక్కా చెల్లెమ్మలకు సీఎం జగన్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. జగనన్న సంకల్పంతో... మహిళా రాజకీయ సాధికారతలో దేశంలో నంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. రాజకీయ, పాలనా పదవుల్లో మహిళలకు అగ్రతాంబూలం లభించిందని పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

'మీ ఓటు... మీ భవిష్యత్తు'పై విద్యార్థులతో భువనేశ్వరి ముఖాముఖి

విశాలాంధ్ర-పత్తికొండ: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆయన సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని గోపాల్ ప్లాజా ఫంక్షన్ హాల్‌లో 'మీ ఓటు... మీ భవిష్యత్తు' అనే అంశంపై ఆమె కె.వి.సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తొలుత ఆమె మండగిరి రామలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భువనేశ్వరి మాట్లాడుతూ, యువతీ యువకులు తొలి ఓటును అమ్ముకోకుండా అభివృద్ధికి వేయాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతి పాలయిందని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాయలసీమకు తెలుగుగంగ, హంద్రీనీవా వంటి సాగునీటి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ హయాంలోనే శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నేత అని, ఎన్నికల్లో నిజం వైపు నిలిచి న్యాయానికి ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. అనంతరం 'కలలకు రెక్కలు' పథకంను విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకు నుంచి రుణాలు, వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సీజీ రాజశేఖర్, కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

విజయమ్మ, షర్మిల, సునీతకు

ఏం జరిగినా జగన్‌దే బాధ్యత

యనమల రామకృష్ణుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వంచన, నమ్మకద్రోహంతో మహిళా ద్రోహిగా సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని, ఆయన వ్యవహరిస్తున్న తీరుతో మహిళా లోకం సిగ్గుతో తల దించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం పంచుకొని పుట్టిన చెల్లెళ్లే జగన్ రెడ్డి నేరాలు, ఘోరాల గురించి చెబుతున్నారని, ఆయన సీఎంగా అనర్హుడని వాళ్లే అంటున్నారని తెలిపారు. జగన్ రెడ్డి 420 అని వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు ఆయన నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయన్నారు. పులివెందులలో సొంత చెల్లెలు సునీతారెడ్డి సభ పెట్టుకోవడానికి కూడా అనుమతి ఇవ్వకపోవడం మహిళలను అవమానించడం కాదా? సొంత కుటుంబ సభ్యుల నమ్మకమే పొందలేని జగన్ రెడ్డి ప్రజల్ని ఏ విధంగా ఉద్ధరిస్తారు? సునీతారెడ్డి, షర్మిల అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ముందా? ఎందుకు నోరు మెదపటం లేదు? అన్నకి ఓటు వేయొద్దని సొంత చెల్లెలే చెప్పిందంటే అర్థం ఏంటి? విలువలు, విశ్వసనీయత అంటూ పదే పదే మాట్లాడే జగన్ రెడ్డి ఎందుకు స్పందించటం లేదు? సొంత బాబాయిని దారుణంగా చంపిన హంతకులకు వంతపాడి న్యాయం కోసం పోరాటం చేస్తున్న చెల్లెళ్లపై విష ప్రచారం చేయటమే మీ విశ్వసనీయతా? ఆఖరికి సొంత చెల్లి పుట్టుక మీద కూడా తప్పుడు ప్రచారం చేయిస్తున్న నీ లాంటి అన్న బహుశా ఏ చెల్లికి ఉండకూడదేమోనని యనమల వ్యాఖ్యానించారు. జగన్ రెడ్డి పాపం పండింది. అధికారం కోసం ఆయన చేసిన పాపాలే నేడు శాపాలుగా మారి జగన్ మెడ చుట్టు బిగుసుకుంటున్నాయని యనమల హెచ్చరించారు. మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యమని, ఎన్టీరామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించడంతో పాటు రిజర్వేషన్లు ఇచ్చి ప్రోత్సహిస్తే.. చంద్రబాబు డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం లభించేలా అవకాశాలు కల్పించారని తెలిపారు.

'విజన్ విశాఖ' ఎవరికోసం?

ప్రజాస్వామ్య విధానాలు పాటించకుంటే మనుగడ కష్టం
సీఎంకు కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మీ ప్రభుత్వం ప్రచురించిన విశాఖ విజన్ ప్రణాళికను పరిశీలించాను, ప్రణాళిక హంగులు చూస్తే ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేట్ కన్సల్టెంట్ చేత తయారు చేయించిన పత్రంలా కనిపిస్తుంది, ఆ ప్రణాళికకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేసి ఉంటుంది, కన్సల్టెంట్‌కు బదులు, విశాఖ ప్రజల అభిప్రాయాలు సేకరించి దీర్ఘకాలిక ప్రణాళిక, వారి సమస్యల పరిష్కారం కోసం తయారు చేసి ఉంటే తక్కువ ఖర్చుతో సరైన ప్రణాళికను ప్రభుత్వం ప్రజల ముందు పెట్టగలిగేదని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శి ఈఏఎస్ శర్మ శుక్రవారం ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అభిప్రాయ పడ్డారు. ఇటీవల విశాఖలో సీఎం జగన్ పెట్టుబడిదారుల సదస్సులో విజన్ విశాఖ ప్రణాళిక విడుదల చేయడంపై ఆయన పైవిధంగా స్పందించారు. విశాఖ నగరం ప్రగతికి కారణం వ్యవసాయం, పాడి పరిశ్రమ, తీరప్రాంతంలో సాంప్రదాయ మత్స్య పరిశ్రమ. మీ విజన్ ప్రణాళిక ఆ మూడు రంగాల అభివృద్ధిని ప్రస్తావిం చలేదంటే, మీ ప్రణాళిక విలువ ప్రజలకు అర్థమై ఉంటుంది. మురికివాడల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజల పరిస్థితి విజన్ ప్రణాళికలో ప్రస్తావించకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూకబ్జాదారులకు మాత్రమే లాభం కలుగుతుంది. ఇక్కడి ప్రకృతి, హెరిటేజ్ వనరులకు హాని కలిగిస్తున్న నేతల పన్నాగాలను ఆపాల్సిన అవసరం ఉంది. ప్రజల సమస్యలు, వారి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజాస్వామ్య విధానాలను అమలు చేయని ప్రభుత్వాలు ముందుకు పోవడం సాధ్యం కాదని గుర్తించాలని హితవు పలుకుతూ లేఖను ముగించారు.

20 ఏళ్ల క్రితమే చంద్రబాబు దోపిడీ

ఆఖరి క్షణంలో పొత్తుల కోసం పాట్లు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐఎంజీ భారత్ అనే బోగస్ కంపెనీకి 20 ఏళ్ల క్రితం చంద్రబాబు చేసిన మహా దోపిడీ చూసి తెలంగాణ హైకోర్టు సైతం విస్తుపోయిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అపధర్మ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐఎంజీ భారత్ అనే బోగస్ కంపెనీకి 850 ఎకరాలు ఇచ్చేశారని చెప్పారు. కనీసం కేబినెట్ ఆమోదం లేకుండానే విలువైన స్థలాలను దోచిపెట్టారన్నారు. లక్షల కోట్ల ఆస్తుల కైవసానికి రెండు దశాబ్దాల క్రితమే చంద్రబాబు ప్రణాళిక రచించారని, అపధర్మ సీఎంగా ఉన్నప్పుడు నాలుగు రోజుల్లోనే ఆ పని పూర్తి చేశారని విమర్శించారు. ఇంత పెద్ద స్కెచ్ వేసిందీ చంద్రబాబేనని చెప్పారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు ఐఎంజీ స్కామ్‌ను బటయటకు తీశారని గుర్తుచేశారు. ఆయన ఔదార్యంతో వదిలేయడంతోనే చంద్రబాబు జైలుకు వెళ్లలేదన్నారు. అప్పటికీ, ఇప్పటికీ చంద్రబాబు వైఖరిలో మార్పు రాలేదని, అంతర్జాతీయ స్కామ్‌స్టర్ చంద్రబాబు అని విమర్శించారు. చిరునామాలేని కాంగ్రెస్‌కు షర్మిలను అధ్యక్షురాలిగా చేశారని, ఆమెను వెనుక నుంచి వేరేవారు నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. పొత్తులనేవీ చంద్రబాబు బలహీనతకు నిదర్శనమన్నారు. అదే సమయంలో మా బలం కూడా తెలుస్తుందన్నారు. అన్ని పార్టీలు కలిసినా అధికారంలోకి రాలేవని, ఇప్పుడు పొత్తులో ఉన్న పార్టీలకు భావసారూప్యత ఏమీ లేదని సజ్జల విమర్శించారు. పొత్తుల కోసం చంద్రబాబు వెంపర్లాడుతున్నారని, ఆఖరి క్షణంలో చివరి ప్రయత్నంగా దిల్లీ చుట్టూ ఆయన ప్రదక్షిణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పొత్తులను చూస్తుంటే మాకు ప్రజాబలం ఎంత ఉందో అర్థమౌతుందని స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు రద్దు

మానవ హక్కుల ఫోరం డిమాండ్

హైదరాబాద్: గాజాలో మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ దేశంలో వ్యాపారవేత్త గౌతం అదానీ ఒప్పందాలు కుదుర్చుకోవడం ఆక్షేపణీయమని మానవ హక్కుల ఫోరం (హెచ్ఆర్ఎఫ్) శుక్రవారం ఓ ప్రకటన చేసింది. ఇజ్రాయిల్ దాడులను ఖండించింది. యూద దేశంతో భారత్ సఖ్యతను తప్పుపట్టింది. భారత ప్రభుత్వం తక్షణమే ఇజ్రాయిల్‌తో చేసుకున్న అన్ని ఒప్పందాలు రద్దు చేసుకోవాలని డిమాండ్ చేసింది. అమాయక పలస్తీనియన్లను ఊచకోత కోసే వారితో చేతులు కలపడమేమిటని నిలదీసింది. ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు చేసుకోవడం భారత్ నైతిక- ఘోర తప్పిదమని పేర్కొంది. 'తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని అదానీ-ఎల్‌బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్... అదానీ డిఫెన్స్, ఎయిరో స్పేస్, ఎల్‌బిట్ సిస్టమ్స్ ఉమ్మడి ప్రాజెక్టు. ఆధునిక డ్రోన్ వ్యవస్థల తయారీకి దీనిని చేపట్టారు. కొత్తగా తయారు చేసిన డ్రోన్లను 'హెర్మ్స్ 900'గా వ్యవహరిస్తారు. ఇజ్రాయిల్ వెలుపల హెర్మ్ తయారీకి ఇదొక్కటే కర్మాగారం. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి, అదానీ గ్రూపులకు మధ్య రూ.100కోట్ల అవగాహన ఒప్పందం ఇటీవల జరిగింది' అని హెచ్ఆర్ఎఫ్ వెల్లడించింది. పలస్తీనా ప్రజలతో అమానవీయ వ్యవహారం, ఆకలితో చంపేస్తున్న వైనాన్ని ఖండిస్తూ ఇజ్రాయిల్‌తో వాణిజ్య సంబంధాలను అనేక దేశాలు తెంచుకుంటే భారత్ మాత్రం మరిన్ని ఒప్పందాలు చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఓవైపు పలస్తీనియన్లకు మద్దతిస్తామంటూ మరోవైపు ఇజ్రాయిల్‌తో వ్యాపారం చేయటం ద్వంద్వ వైఖరికి నిదర్శమని దుయ్యబట్టింది. ఇజ్రాయిల్‌తో అన్ని ఒప్పందాలు రద్దు చేసుకోవాలని భారత్‌ను డిమాండ్ చేసింది. అలాగే గాజాలో తక్షణమే, బేషరతుగా కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. న్యాయం కోసం పలస్తీనియన్ల పోరాటానికి సంపూర్ణ సంఘీభావాన్ని హెచ్ఆర్ఎఫ్ ప్రకటించింది.

మహిళల కోసం జగన్ కృషి

దేశానికే ఆదర్శం
మహిళా దినోత్సవ సభలో వాసిరెడ్డి పద్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ గెలుపే మహిళల గెలుపు అని, రాష్ట్రంలో కోట్లాది మంది మహిళలు హృదయ హారతి పడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా జగన్‌కు పెద్దఎత్తున ధన్యవాదాలు తెలుపు తున్నామని వైసీపీ సీనియర్ నేత వాసిరెడ్డి పద్మ అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మహిళా విభాగం అధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పద్మ విచ్చేశారు. తొలుత కేక్ కట్ చేసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్సీ వరుదు కల్యాణికి ఆమె తినిపించారు. అనంతరం వాసిరెడ్డి మాట్లాడుతూ, తండ్రి, బిడ్డలు, కుటుంబంలో ఎవరు మహిళలకు ఇవ్వని గుర్తింపు, సమానత్వం సీఎం జగన్ ఇచ్చారన్నారు. మహిళల పేరిట ఇల్లు, ఇళ్ల పట్టాలు ఇలా ప్రతి పథకంలోనూ మహిళలకు ఇచ్చిన గుర్తింపుతో సమానత్వం వచ్చిందని వివరించారు. మహిళల కోసం జగన్ చేసిన కృషి దేశానికే ఆదర్శనీయమన్నారు. వై నాట్ 175 అమలు చేసి చూపించేది మహిళలకే సాధ్యమవుతుందని చెప్పారు. విజన్ లేని గుడ్డి పాలన చంద్రబాబు హయాంలో సాగిందని విమర్శించారు. ప్రతి మహిళా తాను అరచేతిలో ఫోన్ ద్వారా రక్షణ పొందే స్థాయికి ఎదిగిందనీ, జగన్ తీసుకొచ్చిన దిశ యాప్ మహిళలకు రక్షణ, ధైర్యాన్ని ఇస్తుందని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని అసెంబ్లీలో చట్టం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వా నికే దక్కుతుందని, ఇది మహిళల విజయమన్నారు. ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం చేయడానికే మహిళా కమిషన్ చైర్మన్ పదవికి తాను రాజీనామా చేసినట్లు ఆమె పునరుద్ఘాటించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ అమ్మాజీ, ఏపీఐసీ చైర్మన్ బండి పుణ్యశీల, మహిళా అడ్వకేట్లు, ఉపాధ్యక్షులు, జోనల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

బీజేపీతో పొత్తు... రాష్ట్రానికి అన్యాయం

టీడీపీ, జనసేనపై శ్రీనివాసరావు మండిపాటు

విశాలాంధ్ర-గుంటూరు: బీజేపీతో టీడీపీ-జనసేన పొత్తు రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రానికి అన్ని విధాల ద్రోహం చేసిన బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని టీడీపీ-జనసేనలను ఆయన ప్రశ్నించారు. గుంటూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలను పదేళ్లపాటు అమలు చేయకుండా బీజేపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని శ్రీనివాసరావు విమర్శించారు. ఇప్పటివరకు బీజేపీతో వైసీపీ లోపాయికారి ఒప్పందం చేసుకొని విభజన చట్టం హామీలు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు టీడీపీ, జనసేన బీజేపీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా దానికి తీవ్ర అన్యాయం చేసినట్టేనని అన్నారు. నరేంద్ర మోదీ 2014 ఎన్నికల్లో అభివృద్ధి గురించి మాట్లాడారని, 2019లో ఉగ్రవాదాన్ని బూచిగా చూపారని, ఇప్పుడు అయోధ్య రామాలయం గురించి మాట్లాడుతూ ప్రజలను మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాల రూపంలో రూ.64 వేల కోట్లు కార్పొరేట్ సంస్థల నుంచి బీజేపీ అక్రమంగా తీసుకుందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని స్టేట్ బ్యాంక్‌ను కోరామని, అయితే మూడు నెలలు సమయం కావాలని కేంద్ర ప్రభుత్వం బ్యాంకు అధికారులతో చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల బాండ్ల సేకరణలో 90 శాతం బీజేపీకి చెందినవేనని అన్నారు. కార్పొరేట్ సంస్థల నుంచి అక్రమంగా విరాళాలు పొందిన బీజేపీ... నిజాయతీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ పాలనలో మనుధర్మ శాస్త్రం అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. పదేళ్లపాటు గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి మహిళా దినోత్సవం పేరుతో రూ.100 తగ్గించటం కంటితుడుపు చర్య అని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల అభ్యున్నతికి తీసుకోవాల్సిన అంశాలపై ప్రణాళికను శ్రీనివాసరావు విడుదల చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కమిటీ సభ్యులు బి.కోటేశ్వరి, ఎల్.అరుణ, బి.సుధా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

11న ఎస్‌బీఐల ఎదుట నిరసనలు

వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న ఎస్‌బీఐ బ్రాంచీల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, నాలుగేళ్లలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఈనెల 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలనీ, ఆ వివరాలను మార్చి 13లోగా ఈసీ బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందన్నారు.



'మహా' శివరాత్రి

నంది వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తులు
అట్టహాసంగా ప్రభోత్సవం

విశాలాంధ్ర-శ్రీశైలం: మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం భక్తుల శివనామస్మరణతో శ్రీశైల పురవీధులు మారుమోగాయి. తొలుత శ్రీశైల మల్లన్నకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. కళాకారుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో వీధులన్నీ కిటకిటలాడాయి. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి బారులుతీరారు. ఆలయ ఈవో డి.పెద్దిరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్పీ రఘువీరారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కులుగ కుండా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం ప్రభోత్సవం వైభవంగా జరిగింది.

పాగాలంకరణ... స్వామి కల్యాణం...

మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామి గోపురానికి పాగాలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన చేనేత కార్మికుడు పృథ్వి వెంకటేశ్వర్లు ఏడాది పాటు నేసిన నూలుపోగులతో పాగాలంకరణ చేస్తారు. అయితే ఈ ఎడాది ఆయన అనారోగ్యంతో ఉండడంతో అతడి కుమారుడు సుబ్బారావు పాగాలంకరణ చేయనున్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం వేద పండితులు నిర్వహిస్తారు. 42 రోజులు అకుంఠిత దీక్షలో ఉన్న శివ దీక్ష స్వాములు దీక్ష విరమణ చేస్తారు. స్వామి అమ్మవార్లను శనివారం సాయంత్రం రథంపై ఆశీనులుగావించి శ్రీశైల పురవీధుల్లో ఊరేగిస్తారు. తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు.

92 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని 92 మంది సచివాలయ సిబ్బందికి జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇటీవల రుషికొండ సమీపంలో రాడిషన్ బ్లూ హోటల్‌లో జరిగిన "విజన్ వైజాగ్" సీఎం కార్యక్రమానికి రానివారికి, ఆలస్యంగా వచ్చిన సచివాలయ సిబ్బందికే షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. అమ్మఒడి, ఆసరా, చేయూత సర్వే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించారనే కారణంతోనే షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు జీవీఎంసీ అధికారులు సర్దుబాటు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 20 లోగా జోనల్ కమిషనర్‌కు వివరణ ఇవ్వాలని అధికారులు కోరారు. వివరణ ఇవ్వకపోతే, మార్చి జీతం నిలిపివేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని నోటీసుల ద్వారా బెదిరింపులకు దిగారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే యోచనలో సచివాలయ సిబ్బంది ఉన్నట్లు సమాచారం.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం: నారా లోకేశ్

విశాలాంధ్ర-కొత్తచెరువు: వైసీపీ పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. పార్టీ శంఖారావం కార్యక్రమంలో భాగంగా సత్యసాయి జిల్లా కొత్త చెరువులోని ధర్మవరం రోడ్డులో శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన టీడీపీ-జనసేన అధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లోకేశ్ తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులను, కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తూ, వారిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, తనపై, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులపై కూడా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని తెలిపారు. ఈ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో సర్పంచుల నిధులను కూడా ఈ ప్రభుత్వం వాడుకుందని, దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు వాటిని నీరుగార్చారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే తమ కుటుంబానికి ఎంతో అభిమానమని తెలిపారు. బీసీలకు కుల ధ్రువీకరణ పత్రం శాశ్వతంగా అందజేస్తామన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, సబ్సిడీ పంటల బీమా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు అందిస్తామన్నారు. హంద్రీ-నీవా కాల్వను పూర్తి చేసి రైతులకు సాగు, తాగు నీరు అందించామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను తప్పక అమలు చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డి.శ్రీధర్ రెడ్డి బ్యాంకులకు 16 వందల కోట్ల రూపాయలు ఎగ్గొట్టారని ఆరోపించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సైకో పాలనలో ప్రజలు విసుగు చెందారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి 2 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బి.కె.పార్థసారథి, ఎమ్మెల్సీ రామ్ భూపాల్ రెడ్డి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు వరుణ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పత్తి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కామకోటి ఆది నారాయణ, నాయకులు మల్లెల జయరాం, జై చంద్రమోహన్, రిటైర్డ్ టీచర్ నాగేంద్రప్రసాద్, కేఎల్వీ ప్రసాద్, డి.ఎస్.పి వేణుగోపాల్, వెంకటనారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, పట్టణ కన్వీనర్ వాలిపి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్య సాయి మహా సమాధిని దర్శించుకున్న లోకేశ్

విశాలాంధ్ర-పుట్టపర్తి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి మహాసమాధిని నారా లోకేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సంస్థ అధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల్లో 1200కు పైగా కేంద్రాల ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని సంస్థ ప్రతినిధులు వివరించారు. లోకేశ్ మాట్లాడుతూ సత్యసాయి బాబా వారి ద్వారా స్ఫూర్తి పొందిన తాము ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

సంపాదకీయం

కశ్మీర్‌లో మోదీ "విహార" యాత్ర

ఆగస్టు అయిదు 2019న జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర స్వరూపాన్ని సమూలంగా మార్చేసి ఆ ప్రాంతాన్ని రెండు కేంద్ర ప్రాంత ప్రాంతాలుగా విడగొట్టి, కశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రాజ్యాంగం నుంచి తొలగించిన అయిదేళ్లకు ప్రధానమంత్రి మోదీకి కశ్మీర్‌లో పర్యటించే తీరిక చిక్కింది. ఈ అయిదేళ్ల కాలంలో ఆయన వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచార సభలకు డజన్ల సార్లు హాజరై ఉంటారు. అలాగే 2023 మే మూడవ తేదీన మణిపూర్ లో రెండు భిన్న జాతుల మధ్య కలహాలు చెలరేగి వందలాది మంది మృతి చెందినా ఆ రాష్ట్రంలో పర్యటించి ప్రజలకు ఊరట కలిగించే తీరిక ఇప్పటిదాకా చిక్కలేదు. గోదీ మీడియా ప్రతినిధులు, పోగేసిన జనం సమక్షంలో మోదీ ప్రసంగం కొనసాగింది. ఇంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు ప్రధానమంత్రి పర్యటనకోసం చేయాల్సి వచ్చిందంటే కశ్మీర్ లో పరిస్థితి ఈ అయిదేళ్లలో ఏ మాత్రం చక్కబడలేదని రుజువు అవుతోంది. మోదీ సభకు జనం ఎక్కడ వస్తారో రారోనన్న అనుమానం ఉన్నందువల్లే ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, జమ్మూ-కశ్మీర్ లోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు మోదీ ర్యాలీకి విధిగా హాజరు కావాలని హుకుం జారీ చేశారు. తరలించిన ప్రేక్షకుల ముందు మోదీ యధావిధిగా మునుపటి ప్రభుత్వాలు కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిపై ప్రజలను మోసగించాయని ఆరోపణలు గుప్పించారు. మునుపటి ప్రభుత్వాలు ఈ పని చేశాయని మాటవరసకు అంగీకరించినా 370వ అధికరణం రద్దు తరవాత పరిస్థితి ఏ మేరకు మెరుగు పడిందో చెప్పే దమ్ము లేకే మోదీ ఇదివరకటి ప్రభుత్వాలను నిందించడంలో నిమగ్నమైపోయారు. కశ్మీర్ అభివృద్ధికి 370వ అధికరణమే ప్రధాన అడ్డంకిగా ఉందని బీజేపీ నేతలు జోరుగా ప్రచారం చేశారు. అదే లేకపోతే కశ్మీర్ సైతం ఇతర రాష్ట్రాలలాగే అభివృద్ధి పథంలో ఉరకలెత్తి ఉండేదని ప్రచారం చేశారు. వాస్తవం ఏమిటంటే 370వ అధికరణం రద్దు చేయకముందు కూడా జమ్మూ-కశ్మీర్ సామాజిక ఆర్థిక అభివృద్ధి సూచికల్లో మోదీకి ప్రీతి పాత్రమైన గుజరాత్ కన్నా మెరుగ్గానే ఉంది. 370వ అధికరణాన్ని రద్దు కోసం బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో అభివృద్ధి కుంటుపడినందువల్లే కశ్మీర్‌లో భూముల ధరలు చాలా తక్కువగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. భూముల ధరలు పెరగడం అభివృద్ధికి సంకేతం కాదు. అది స్థిరాస్తి రంగం సామాన్య జనానికి అందుబాటులో ఉండకుండా పోవడానికి మాత్రమే నిదర్శనం. పైగా కశ్మీర్‌లో ఇతర రాష్ట్రాల వారు భూములు, ఆస్తులు కొనడంపై ఆంక్షలు ఉన్నాయి కనక ధరలు అమాంతం పెరిగిపోయే అవకాశం బొత్తిగా లేదు. ఆ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తి తొలగిస్తే పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా సమకూరుతాయని మోదీ ప్రభుత్వం బాకా ఊది ప్రచారం చేసింది. మూడేళ్ల కాలంలో జమ్మూ-కశ్మీర్‌లో రూ. రూ. 84,544 కోట్ల పెట్టుబడులు సమకూరుతాయన్న ప్రచారమైతే జరిగింది. కానీ సమకూరింది కేవలం రూ. 2,518 కోట్లు మాత్రమే. నూతన కశ్మీర్ అవతరిస్తుందన్న ప్రచారం ఆచరణలో ఎక్కడా కనిపించలేదు. పోనీ శాంతి భద్రతల పరిస్థితి ఏమైనా మెరుగైందా అంటే అదీ లేదు. 2019 ఆగస్టు 5 నుంచి 2022 జులై 9 మధ్య కాలంలో భద్రతా దళాలకు చెందిన 128 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కాలంలోనే 118 మంది అమాయక పౌరులు నేలకొరిగారు. వీరిలో అయిదుగురు కశ్మీరీ పండితులు. మరో 16 మంది హిందువులు, సిక్కులు. ఈ అంకెలు కేంద్రం పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించినవే. మోదీ పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులు కొన్ని వీడియోలు విడుదల చేశారు. అందులో ఒక వీడియోలో ఒక యువకుడు తానూ ఒకప్పుడు రాళ్లు విసిరిన వాడినేనని, ఇప్పుడు ఆ పని చేయడం లేదని ఇదివరకెన్నడూ ఓటు వేయలేదని ఇప్పుడు వేస్తానని చిలకపలుకులు పలికారు. ప్రత్యేక ప్రతిపత్తి రద్దు అయిన తరవాత అక్కడ ఎన్నికలు జరగనే లేదని కిరాయి ఇచ్చి తీసుకొచ్చిన ఆ యువకుడికి చెప్పడం బీజేపీ నాయకులు మరిచి పోయినట్టున్నారు. జరిగిందల్లా స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే. ఆ ఎన్నికలలో ప్రతిపక్ష ఐక్య సంఘటన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ విజయం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఎంతటి ప్రతికూలత ఉందో తెలియజేస్తోంది.

మోదీ పర్యటన ఒక విజయ ప్రస్థానంలా సాగింది. కశ్మీర్ స్వరూపం మార్చేయడం తమ విజయం అని బీజేపీ, ముఖ్యంగా మోదీ దండోరా వేసుకుంటున్నారు. ఆ ప్రాంతంలో పరిస్థితి ఏ మాత్రం మారలేదు. ఇప్పటికీ వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ మీద అనేక ఆంక్షలున్నాయి. అడపా దడపా ఇంటర్నెట్ సదుపాయం లేకుండా చేస్తూనే ఉన్నారు. దాదాపు మూడు దశాబ్దాల కింద ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఇతర ప్రాంతాలలో శరణు పొందిన కశ్మీరీ పండితులను సొంత గూళ్లకు చేరుస్తామని మోదీ హామీ ఇచ్చారు. సొంత గడ్డను వదిలేయకుండా ఇప్పటికీ అక్కడే ఉన్న కశ్మీర్ పండితులకు 370 తరవాత దక్కిన స్వేచ్ఛ ఏమీ లేదు. మోదీ పర్యటన సందర్భంగా "జాగ్రత్త"గా మసులుకోవాలని, ఇళ్లనుంచి బయటకు రాకూడదని అధికారులు కట్టడి చేశారంటే ఏ మాత్రం స్వేచ్ఛ ఉందో అర్థం చేసుకోవచ్చు. మహా శివరాత్రి పండగ కూడా స్వేచ్ఛగా జరుపుకునే అవకాశం లేకుండా పోయిందని వారు దిగులు పడుతున్నారు. లడాఖ్ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించడం, ఈ ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలులో చేర్చడం కోసం కేంద్ర ప్రభుత్వానికి, దీనికోసం ఏర్పాటు చేసిన ఉపసంఘానికి మధ్య చర్చలు విఫలమైనాయి. జనం ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. రామన్ మగ్సెసే అవార్డు గ్రహీత సోనం వాంగ్ చుక్ మూడు వారాల నిరాహార దీక్ష ప్రారంభించారు. అవసరమైతే ఆమరణ నిరసన దీక్ష చేస్తానంటున్నారు. లడాఖ్ లో ఒకే ఒక్క లోకసభ సీటు ఉంది. హామీలు నెరవేర్చనందుకు వచ్చే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు ఆలోచిస్తున్నారు. కశ్మీర్‌లో ముస్లింల మత నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫారూఖ్ 2019 ఆగస్టు అయిదు నుంచి గృహ నిర్బంధంలోనే ఉన్నారు. ఆయనకు తీవ్రవాదుల నుంచి ముప్పు ఉంది కనక ఆయనే బయటకు రావడం లేదని ప్రభుత్వ అధికారులు హైకోర్టుకు తెలియజేశారు. తీవ్ర వాదుల నుంచి ముప్పు ఉందంటే ఆ బెడద మాయమైందన్న ప్రచారం అంతా డొల్లేనని ప్రత్యేకంగా చెప్పాలా! మోదీ పర్యటనలో గత ప్రభుత్వాన్ని నిందించడంతోనే సరిపెట్టుకున్నారు తప్ప కశ్మీర్ ప్రజలకు ఏం ఒరగబెట్టారో మాత్రం చేప్పలేదు. కోట్లాది రూపాయల పథకాలు ప్రకటించి వాటి సంగతి మరిచి పోవడం మోదీకి అలవాటైన ప్రచార ఎత్తుగడే.

పేదరిక నిర్మూలన కొలతలపై ఆహార భద్రత ప్రభావం

ప్రొఫెసర్ కె.ఎస్. చలం

గత కొన్ని రోజులుగా భారత కార్పొరేట్ మీడియా దాని తోకలు భారత దేశంలో పేదరికం పూర్తిగా నిర్మూలన అయిందని, రెండు శాతానికి దిగువకు యీ సంఖ్య గత పదేళ్ళ ఆర్థిక విధానాల కారణంగా తగ్గిపోయింది అని ప్రచారం మొదలుపెట్టింది. ఇదో పెద్ద వింత. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రభావం దేశ ప్రజలను అభివృద్ధి వైపు నడిపిస్తుంది అనటానికి యిదే నిదర్శనం. దేశ విదేశాల్లో వున్న ఆర్థిక శాస్త్రవేత్తలు, ప్రచారకులు దీనిపై పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు, టీవి డిబేట్‌లు నిర్వహిస్తున్నారు ఎన్నికలు దగ్గర పడ్డాయి కాబట్టి పాలక పార్టీ నిజంగానే తమ కిరీటం లో కలికితురాయిగా ప్రచారం చేసుకుంటుంది. ఇది నిజమేనా! పేదరికం అన్న భావనను 1889 లో సామాజిక శాస్త్రవేత్తయిన ఇంగ్లండ్‌కు చెందిన చార్లెస్ బూత్ మొదటిసారిగా ఇలా పేర్కొన్నాడు. అతని ఉద్దేశంలో మనిషి బ్రతకటానికి భౌతికంగా సామర్థ్యంగా పనిచేయడానికి కావలసిన కనీస అవసరాలు లేకపోతే పేదరికం వున్నట్లే. ఈ సమస్యను ఆర్థిక శాస్త్రవేత్తలు ముఖ్యంగా భారత దేశంలోని ప్లానింగ్ కమిషన్ లో వున్న కొంతమంది 1962 లో ఒక వర్కింగ్ గ్రూప్‌గా ఏర్పడి నాటి మన దేశ పేదరికంపైన, దాన్ని తగ్గించే వ్యూహాలపై చర్చించారు. వారి ఉద్దేశంలో నాటికి సగటున నెలకు రూ.20, గ్రామీణ ప్రాంతంలో రూ.25 పట్టణ ప్రాంతంలో బ్రతకటానికి అవసరం అని తేల్చారు. అప్పట్లో అది పెద్ద సంచలనం. రామమనోహర లోహియా పార్లమెంటులో నెహ్రూను దుయ్యబట్టడానికి కొన్ని వివరాలతో సంచలనం సృష్టించిన విషయం పత్రికల్లోను, నాటి రాజకీయ వేత్తల మధ్య చర్చకు దారి తీసింది. పేదరికాన్ని ఒక ఆర్థిక, సామాజిక సమస్యగా గుర్తించి దానిపై పరిశోధన చేసిన వారు వి.యమ్. దండేకర్, రత్ అన్న ఆర్థిక శాస్త్రవేత్తలు 1971 లో ప్రచురించిన పేదరికంపై పరిశోధన చాలా చర్చలకు దారి తీసింది. ప్రధానంగా వీరు మొదటిసారి మనిషి పని చేయటానికి కావలసిన శక్తి కేలరీలలోకి మార్చి, దానికి కావలసిన ఆదాయాన్ని గణించారు. వారి ఉద్దేశం ప్రకారం నెలకు సగటున గ్రామీణ ప్రాంతంలో రూ.171లు, పట్టణ ప్రాంతంలో రూ.271.70 1960-61 ధరల ప్రకారం వుండాలని ప్రకటించారు. అప్పుడు మొదలయిన చర్చ యిప్పటికీ కొనసాగుతోంది. అది రాజకీయ పార్టీల మేనిఫెస్టోలలో చేరిపోయింది. ఇందిరా గాంధీ పెద్ద స్లోగన్ 'గరీబీ హటావో, పేదరిక నిర్మూలన' అంటూ ప్రచారం చాలాకాలం కొనసాగించి అధికారంలో కొనసాగారు. పేదరిక నిర్మూలన కాదు గాని, గరీబుల నిర్మూలన జరుగుతోందని ప్రతిపక్షం వేళాకోళం చేయటం చూశాం. అయితే దీనికంతటికీ కారణం ప్రభుత్వాలు పేదరికం నిర్మూలించాలనే చిత్తశుద్ధి లేకపోవడం. దానికి కావలసిన వనరుల సమీకరణ పెట్టుబడిదార్లను, భూస్వాములను నియంత్రించి ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చే మెరుగైన ఆర్థిక విధానాలు చేపట్టక పోవటం. అందుకు రాజకీయ నాయకుల మద్దతు లేకపోవడం. అదే కాలంలో కేరళలో పేదరిక నిర్మూలన చేబట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను యివ్వటంతో చర్చ ఆర్థిక, సామాజిక శాస్త్రాలను దాటి రాజకీయ వేదికల మీదకు మళ్ళింది. ఇంతలో ప్రపంచ బ్యాంక్ ప్రవేశించి పేద దేశాల్లో పేదరిక నిర్మూలనకు మా వద్ద మందుంది. మీ ఆర్థిక ఆస్తులన్నీ ప్రైవేట్ పరం చేసేయండి, ఆర్థిక నియంత్రణ నుండి ప్రభుత్వ తప్పుకుంటే పేదరికం దానంతట అదే మాయమై పోతుంది అన్నారు. 1991లో నాటి ఆర్థిక సమస్యల దృష్ట్యా పి.వి.నరసింహారావు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు వద్ద అప్పుతెచ్చి దేశాన్ని అగ్ర రాజ్యాలైన అమెరికా వంటి వ్యవస్థలతోను వాషింగ్టన్ కన్సెస్ అనే ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాలు చేబట్టారు. అయినా పేదరిక నిర్మూలన సగటు శాతం గతం కంటే ఎక్కువగా తగ్గలేదు. అంటే ముందు ఏడాదికి సుమారు ఒక శాతం తగ్గితే ప్రపంచ బ్యాంకు విధానాల ద్వారా కూడా అంతకంటే ఎక్కువ తగ్గలేదు. దీనిపై వేల పేజీల్లో పరిశోధనా వ్యాసాలు, పుస్తకాలు టెండూల్కర్, రంగరాజన్, సక్సేనా వంటి నిపుణుల నివేదికలు వున్నాయి. ఈ గణాంకాలలో తేలిన విషయ మేమిటంటే, వారు సర్వే చేసి లెక్క కట్టిన వివరాలు, వాస్తవ రూపంలో కనబడకపోవటం. అంటే అంకెల్లో చూపిన విధంగా పేదల సంఖ్య తగ్గకపోగా దళిత, ఆదివాసి, సేవక కులాలు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఎప్పటిలాగానే జీవించటం ప్రజల పక్షం వహించే వామపక్షాలకు, పౌర సమాజానికి కొంత ఆవేదన కలిగింది. మనం అంకెలను కాకుండా ప్రజల దైనందిన జీవితంలో పనిచేసుకోవటానికి ఉపాధి కల్పన, తినటానికి కావలసిన కనీస ఆహారం కల్పించాలి, అన్న ఆచరణాత్మక కార్యక్రమాలు కావాలని ఉద్యమాలు చేశారు. అప్పట్లో పక్క సంచీ గాళ్లు అని వేళాకోళంచేసే పౌర సమాజ ఉద్యమకారులు యు.పి.ఎ ప్రభుత్వంతో ఉన్న వామపక్ష వాదులు కలిసి ప్రజల కనీస అవసరాలు తీర్చే ఆర్థిక కార్యక్రమాలు వుండాలి అని ప్రభుత్వంపై పెద్ద ఒత్తిడి తెచ్చారు. గతంలో ఈ ఆలోచన వున్న యు.పి.ఎ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం 2005లో చేశారు. తద్వారా దేశంలో, ప్రతి గ్రామంలో పనిచేసే వ్యక్తికి వంద రోజులు కనీస ఉపాధి వచ్చేలా 625 జిల్లాల్లో ప్రవేశపెట్టడంతో పేదల చేతిలోకి కొనుగోలు శక్తి వచ్చి చేరింది.

అప్పటి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అమ్మే కనీస అవసరాలైన ఆహారం, బియ్యం, గోధుమ, పంచదార వంటి వస్తువులు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. పేదరికం తగ్గుముఖం పట్టింది. మానవ నాగరికత చరిత్ర అంతా వెనుకబాటుతనం, అనాగరిక పరిస్థితులను అధిగమించి ముందుకు సాగడమే కనిపిస్తుంది. ఎక్కడో ఆఫ్రికా వంటి కొన్ని దేశాల్లో అక్కడి రాజకీయ వ్యవస్థ కుమ్ములాటల మూలంగా అభివృద్ధి లేక ఘనీభవించినా, ప్రపంచంలో అన్ని దేశాలు ముందుకు వెళుతున్నాయి. 18వ శతాబ్దంలో పేదరికంలో నలిగిన దేశాలు యిప్పుడు ఆర్థికంగా ముందున్నాయి. అది మానవ నాగరిక లక్షణం. ఇది ఎవరో ఒకరు చేస్తే జరిగేది కాదు దాన్ని అడ్డుకుంటే కొన్ని రోజులు స్తంభించినా, దాన్ని ఎదిరించి ప్రజలు పీడితులు పోరాటం చేసి ముందుకు తీసుకు వెళతారు. అందుకే అంతర్జాతీయంగా కొన్ని వ్యవస్థలను నిర్మించుకున్నాము. ఐక్యరాజ్యసమితి, దానికి అనుబంధంగా ఆహార, ఆరోగ్య, అభివృద్ధి, సంస్కృతి సంస్థలు వున్నాయి. ఇవి ప్రతి తరంలో మనిషి అభివృద్ధికి కావలసిన విధానాలను రూపొందించి సభ్యదేశాలు అవలంబించేలా చేస్తాయి. అలా వచ్చిందే మానవ అభివృద్ధి నివేదిక, పేదరిక నిర్మూలన, వైద్యం, విద్య, ఆహారం వంటి విషయాల్లో ఒక స్థిరమైన వృద్ధి వుండాలనే అంతర్జాతీయ ప్రణాళిక, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల వంటివి. వీటి ద్వారా సభ్య ప్రభుత్వాలు తమ ప్రణాళికలు రూపొందించుకున్నాయి. మన దేశంలో పేదరికం అధికంగా వుండటం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులు అందించినా సరైన కొనుగోలు శక్తి లేక పేదలు, పేదలుగానే మిగిలిపోతున్నారు. అందుకే పేదలకు ఆహార భద్రత కల్పించాలీ అని ఉద్యమం వచ్చింది. దానికోసం 2013లో ఆహార భరోసా చట్టం వచ్చింది. అప్పుడు నేను జాతీయ మానవహక్కుల కమిషన్‌లో దక్షిణ భారతదేశ రెపోర్టరీ (ప్రతినిధిగా వున్నాను. ఆ చట్టంపై జాతీయ మానవ హక్కుల సంఘం చర్చలో పాల్గొని ఆహార భద్రత కంటే ఆదివాసీ ప్రాంత ప్రజల గౌరవం యినుమడించేలా ప్రభుత్వం బాధ్యతగా ఆహారం సరఫరా చేయాలి అని ఒక పరిశోధక పత్రం సమర్పించాను. కారణం లేకపోలేదు. ఆదివాసీలు కాయలు, ఆకులు, ఎలుకలు (ముసాహర్ కులం) తింటూ జీవితం గడపడం వారికి గౌరవప్రదం కాదు. వారి పోషక విలువలు మాత్రమె కాదు వారి మానవ గౌరవం, అధికారం గుర్తించి హక్కుగా ఆహారం అందించాలి అన్నాము. అది చట్టమయింది. దాని ప్రకారం ప్రతి మనిషికి ఆహారం అందించే బాధ్యత ప్రభుత్వానిది. చట్టంలో మొత్తం 45 అధికరణలు 4 షెడ్యూల్లో వున్నాయి. దీని ప్రకారం ప్రతి ఒక్కరికి వారి అర్హత ప్రకారం ఆహార వస్తువులు బియ్య గోధుమలు వారి యింటి వద్దనే సరఫరా చేయాలి. ఏయే వయసు వారికి ఎంతెంత కేలరీలు వుండాలి అంటే, మధ్యాహ్నం భోజనం ద్వారా సరఫరా చేయాలి. నాటికి ప్రభుత్వ సబ్సిడీ బియ్యం మీద బియ్యం కిలో రూ.3, గోధుమలు రూ.2, ముతక ధాన్యం రూ.1, చొప్పున సరఫరా చేయాలి. ఒక్కో రాష్ట్రానికి ఎంతెంత కేటాయించింది చట్టంలోనే పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 32.10 లక్షల టన్నులు, దేశానికంతటికి 549.0 మిలియన్ టన్నులు అని ప్రకటించారు. ఇందులో పిల్లలు, మహిళలు, బాలింతలకు ప్రత్యేక ఏర్పాట్లను పేర్కొన్నారు. యిప్పుడు 80 కోట్ల మందికి వారి యింటి వద్దే బియ్యం గోధమలు ఇస్తున్నారు. చట్టం వుంది కాబట్టి 31 లక్ష ల కోట్ల కేంద్ర బడ్జెట్ లో 2.72 లక్షల కోట్లు అంటే 9 శాతం దీనికి కేటాయిస్తున్నారు. ఇది ప్రజల విజయం. అంటే స్వతంత్రం వచ్చిన తర్వాత 65 ఏళ్లకి ప్రజా ఉద్యమాల ప్రభావంతో చట్టం రూపంలో ప్రజలకు ఆహార భద్రత కల్పించారు. సామాన్య ప్రజలకు ఆహార భద్రత దొరికితే మిగతా అవసరాలు తీర్చుకోవటం సులభం.

ఇప్పుడు ప్రచారం చేస్తున్న పేదరిక నిర్మూలనకు వాడిన గణాంకాలు వినిమయం వస్తువులపై చేసే ఖర్చు ఆధారంగా లెక్కించి చేసింది. ఈ ఖర్చులు దిగువ 5% జనాభా నెలకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.1373, పట్టణ ప్రాంతంలో రూ.2001 ఖర్చు ఉంది కాబట్టి వీరంతా బహుళ పరిణామ సూచిక ప్రకారం పేదరికంలో వున్నట్లు మిగతా 95% పేదరికం పైన వున్నట్లు అన్నారు. కాదు, కాదు మా లెక్కల ప్రకారం 2 శాతమే అని నీతి ఆయోగ్ వారు వాదిస్తున్నారు. మరి వాస్తవ పరిస్థితి ఏమిటి ? గణాంకాలు జాగ్రత్తగా పరిశీలించి విశ్లేషణ చేయకపోతే అనేక రకాల ముగింపులు పలకవచ్చు. ఎందుకంటే ఈ లెక్కలకు ప్రపంచ 125 దేశాల ఆకలిసూచీ లో భారత్ 111వ స్థానంలోకి దిగజారిన పరిస్థితి అర్థం కాదు. వీటి మధ్య పొంతన లేకపోవటానికి కారణం గణాంకాలను సరిగా అర్థం చేసుకోలేకపోవడం. ప్రజలకు ప్రజా ఉద్యమాల ద్వారా లభించిన ఆహార భద్రత మూలంగా వారిని నిజ ఆదాయం పెరిగి, దాన్ని కొన్ని వినియోగ వస్తువులపై ఖర్చు చేయడంతో అది వారి పేదరికం తగ్గి నట్లు కనిపిస్తుంది. గానీ, ప్రపంచ ఆహారసూచీ అంటే ఐదేళ్ల లోపు పిల్లల సాధారణ బరువుతగ్గటం, వారి పొడుగు తగ్గ బరువు, మరణం, సరైన పోషణ విలువలు లభించకపోవడంతో జరిగే లేమి తెలియజేస్తుంది. మన దేశంలో జరిగిందిదే. కడుపుకు తిండి పెట్టినంత మాత్రాన పోషక విలువలు అందించినట్లు కాదు. మధ్యాహ్న భోజన పథకంలో కూడా కొన్నిచోట్ల గుడ్డు కూడా పెట్టడం లేదు. అది మాంసాహారం మత విరుద్ధం అని ఆపేశారు. అంటే భారతదేశం సాధారణ ఆహార ఆధారిత పేదరికం తగ్గించింది గాని నిజమైన లేమిని జయించే పేదరిక నిర్మూలన యింకా జరగలేదు. ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల సరసన మనం చేరాలంటే అంబాని, అదాని సంపద పెంచితే లెక్కల్లో జాతీయాదాయం పెరిగి భారత్ ట్రిలియన్ జాబితాలో చేరవచ్చు. గానివారి పక్కన డొక్కలు మాడిన, కుంచించుకుపోయిన శరీరాలతో పేదలు మనల్ని వెక్కిరిస్తూనే ఉంటారు. వారి శాతం సున్నా అయినప్పుడే మన అభివృద్ధి సాధించినట్లు!

సెల్ : 7702200026

మన రైతుకు విదేశీ పండ్ల హాని

దాక్టర్ సోమ మర్ల

మన మార్కెట్లను విదేశీపండ్లు ముంచెత్తడంతో పంజాబ్ తదితర రాష్ట్రాల్లో సన్నకారు రైతులు పండించే పండ్లకు సరైన ధర ఉండటంలేదు. ఫలితంగా నష్టపోతున్నారు. కాలిఫోర్నియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి రకరకాల పండ్లు హైదరాబాద్, గడ్డి అన్నారం మార్కెట్ల నిండా పండ్లు ఉంటున్నాయి. ముఖ్యంగా నారింజ, కమల, ఆపిల్ పండ్లు విపరీతంగా వస్తున్నాయి. అయితే కిలో నారింజపండ్ల ధర కేవలం రూ.40లు పలుకుతోంది. ఉత్పత్తిధరలో కేవలం సగమే లభిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస చట్టబద్ధ ధర లేకపోవడంవల్ల రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చౌకగా రేషన్ పంపిణీ చేసేందుకు ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటీఓ) పెద్ద అడ్డంకిగా ఉంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం భారతదేశం కూడా డబ్ల్యుటీఓలో చేరింది. ఫలితంగా మనరైతులు తీవ్ర దురవస్థలో ఉన్నారు. 2019 సంవత్సరంలోనే 10వేల మంది రైతులు ఆత్మహత్యలు తదితర మార్గాలద్వారా మరణించారు. (2020 డౌన్ టు ఎర్త్ నుంచి) ఈ నేపధ్యంలో డబ్ల్యుటీఓ నుంచి భారతదేశం వైదొలగాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

భారతదేశం డబ్ల్యుటీలో చేరేటప్పుడు రైతులకు గొప్పగొప్ప వాగ్దానాలు చేశారు. ప్రపంచ మార్కెట్లకు మన రైతులు పండించే ఉత్పత్తులు అపారంగా ఎగుమతి అవుతాయని, అదనపు ఆదాయం లభిస్తుందని వాగ్దానం చేశారు. అయితే, ఆనాడు చేసిన వాగ్దానాలకు భిన్నంగా మనకు ఏ ప్రయోజనం కలగలేదు. అభివృద్ధిచెందిన, చెందుతున్న దేశాల మధ్య స్వేచ్ఛా మార్కెట్‌లు ఏమాత్రం ఏర్పడలేదు. గడచిన మూడు దశాబ్దాల్లో సంపన్నమైన పాశ్చాత్యదేశాలకు చెందిన బహుళజాతి కార్పొరేషన్‌లు అభివృద్ధి చెందుతున్న దేశాల రైతులు నష్టపోయారు. అభివృద్ధి చెందిన దేశాలు ప్రయోజనం పొందాయి. అభివృద్ధిచెందిన దేశాల మార్కెట్లను వర్ధమాన దేశాల ఉత్పత్తులకు అనుమతించాలని సుంకాలను ఎత్తివేయాలని, సబ్సిడీలను ఇవ్వాలని, విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగంలేకుండా పోయింది. అంతేకాకుండా, అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యవసాయ ఉత్పత్తుల ధరలను పశ్చిమ దేశాల మార్కెట్లలో తగ్గించి వేస్తున్నారు. "వాణిజ్య సౌకర్యం" కింద సంపన్నదేశాల వ్యవసాయ ఉత్పత్తులు భారీ సబ్సిడీల మూలంగా స్థానిక ఉత్పత్తుల ధర తగ్గిపోయి వ్యవసాయదారులు దివాళా తీస్తున్నారు. లక్షలాదిమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. న్యూజిలాండ్ నుంచి యాపిల్స్, అమెరికా నుంచి కమలాలు విపరీతంగా మార్కెట్లకు వస్తున్నాయి. వినిమయదారులు అధిక ధరలను పెట్టి కొనవలసి వస్తున్నది. ఇదే సమయంలో మన రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదు. డబ్ల్యుటీఓ షరతులను అంగీకరించడం వల్ల మన రైతులు నష్టపోతున్నారు. పశ్చిమ దేశాల స్టాకు భవిష్యత్తు మార్కెట్ బ్రోకర్లు ధాన్యం టోకు డీలర్లు, తదితరులు కలిసి మనరైతులను కష్టాలపాలు చేస్తున్నారు. డబ్ల్యుటీఓలో పరిమాణాత్మక పరిమితుల యంత్రాంగం అత్యధిక దేశాలలో భారత వాణిజ్య వివాదాల పరిష్కారంలో విఫలమవుతున్నారు. కనీస మద్దతుధరల రూపంలో సబ్సిడీలను రద్దు చేయాలని, అభివృద్ధిచెందిన దేశాలు కోరుతున్నాయి. ఇప్పటికే అమెజాన్, వాల్‌మార్ట్ బహుళజాతి కంపెనీలు ఆన్‌లైన్ ద్వారా స్థానిక ఆహారమార్కెట్‌లలో ప్రవేశించాయి. దీనివల్ల రైతుల,చిన్న, సన్నకారుల చిల్లర వ్యాపారులను నష్టపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పంటలకు చట్టబద్ధమైన కనీసమద్దతుధరను కల్పించాలని మనరైతులు తీవ్రమైన పోరాటాన్ని నిర్వహిస్తున్నారు. మార్కెట్లలో వాణిజ్య వస్తువుగా ఆహారధాన్యాలను డబ్ల్యుటీఓ చూస్తున్నది. అదే సమయంలో ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆకలిగొన్న కోట్లాదిమంది పేదలకు ఆహారాన్ని అందించే బాధ్యతను విస్మరిస్తున్నది. సూడాన్ , జార్ఖండ్‌లో సన్నకారు రైతులకు సబ్సిడీ ఇవ్వడాన్ని డబ్ల్యుటీఓ కేవలం వాణిజ్యదృష్టితో మాత్రమే చూస్తున్నది. డబ్ల్యుటీఓ వ్యవసాయ రంగంపై చర్చలు, సబ్సిడీలపై వక్రీకరణ అంశాల చుట్టూ వ్యవహారం నడుస్తోంది. అభివృద్ధిచెందిన పశ్చిమదేశాల వ్యవసాయ ఉత్పత్తుల ధరలతో పోలిస్తే అభివృద్ధిచెందుతున్న దక్షిణదేశాల ఉత్పత్తులు చౌకగా ఉంటున్నాయి. 1986-2022 మధ్య కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ధర ఆరు రెట్లు పెరిగింది. అలాగే ఆహార ధాన్యాల ధరలు కూడా అంతే పెరిగాయి. దీనివల్ల కోట్లాది రైతుల పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ఇదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తులను ప్రపంచమార్కెట్‌లలో అతిచౌకగా గుమ్మరిస్తున్నాయని అభివృద్ధిచెందిన పశ్చిమ దేశాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణ పచ్చి అబద్ధం. సూడాన్‌లో సన్నకారు రైతుతో పోల్చడం పూర్తిగా అభ్యంతరకరమైన విషయం. ప్రపంచమార్కెట్‌లో సూడాన్ పత్తి రైతు అమెరికా రైతుతో పోలిస్తే చాలా నష్టపోతున్నారు. 40 శాతం ప్రపంచ ఆహారధాన్యం పప్పులు, నూనెవిత్తనాల వ్యాపారాన్ని డబ్ల్యుటీఓ వాణిజ్యఆంక్షలు నియంత్రిస్తున్నాయి. ఎరువుల మార్కెట్లు, ఆహారధాన్యాల మార్కెట్ల విలువల గొలుసులను కార్పొరేట్ వ్యవస్థ నియంత్రిస్తున్నది. 140కోట్ల మంది ప్రజలతో భారతదేశంలో అతి పెద్ద మార్కెట్. మనదేశంలోని రిలయన్స్ అదానీ లాంటి అతి పెద్ద స్థానిక వాణిజ్యమార్కెట్లతో పశ్చిమదేశాల వ్యవసాయవాణిజ్య కంపెనీలు కుమ్మక్కై ఆహార ధాన్యాలకు కనీస ఉత్పత్తి ధరను, సబ్సిడీలను ప్రజాప్రభుత్వ పంపిణీ వ్యవస్థ, ఆహార స్వయంసమృద్ధిలాంటి వాటిని ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. భారత వ్యవసాయరంగం ప్రపంచ వ్యవసాయ మార్కెట్లతో మరింతగా మమేకమైతే చిన్న,సన్నకారురైతులు,కౌలురైతులు, భూములులేని రైతులు తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కోనున్నాయి.



కవిత్వం ఎందుకంటే...

ఇలా వివరించాడు కవి పసునూరి శ్రీధర్ బాబు ఫేస్‌బుక్‌లో ఈ మధ్యనే. అవును కవిత్వం ఎందుకని నాకూ చాలాసార్లు అనిపించింది. నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రయాణంలో నాకు నేను చాలాసార్లే ఇలా ప్రశ్నించుకున్నాను. ఈ సందేహానికి మళ్లీ ఆ శ్రీధర్‌బాబే సమాధానం చెప్పారు..

"నడవాలి కదా దారి లేకున్నా..
ఎక్కడి దాకా అని అడిగారు
దారి మధ్యలోనే పాదాలు తెగిపోతాయని తెలుసునని..."
శ్రీధర్ బాబు సమాధానం.

ఇది చదివాక నా పాదాలు చూసుకున్నాను. చాలాసార్లు తెగిపోయిన గురుతులు కనిపించాయి. మళ్లీ ఓ పద్యం పువ్వుని చూడగానే అవే పాదాలు దేదీప్యమానంగా వెలుగుతూ కనిపించాయి. ఇందుకే కవిత్వమంటే ఏమిటో బోధపడింది. ఈ కవిత్వ ప్రయాణంలో బహుశా ప్రతి ఒక్కరికి ఇది అనుభవంలోదే. కవిత్వం ఏం చేస్తుందనే ప్రశ్న దాన్ని అనుభవించని వారి నుంచి ఎదురవుతుంది. ఇదో పిచ్చి... వీళ్లంతా పిచ్చిమాలోకం అని కూడా అనుకుంటారు. కవిత్వం చదివితే... రాస్తే ఏం మిగులుతుంది అని కూడా ప్రశ్నిస్తారు. ఆ పిచ్చిమాలోకంలో ఉన్న వారిని నిలదీస్తారు కూడా. దీనికి కూడా కవిత్వమే సమాధానం అంటున్నారు ఈ కవి శ్రీధర్ బాబు. ఇదిగో ఇలా మిగిలాయంటున్నారు.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

" నా పాదాల కింద గుచ్చుకున్న ముళ్ళ
మీ పాదాల కింద తడిసిన వెచ్చని మట్టి
చాలు కదా" అంటున్నారు.

కవిత్వ పిచ్చోళ్లకి ఇది చాలు కదా. ఆ పిచ్చిమాలోకంలో విహరించేందుకు ముళ్ల దిగిన పాదాలు అతని కవిత్వావరణ చుట్టూ తిరిగితే కలిగే ఆనందాన్ని దేంతో కొలుస్తాం. దేంతో తరిస్తాం. ఇక ఈ కవిత్వాన్ని ఆస్వాదించని వారి పాదాలకు అంటుకున్న తడిసిన వెచ్చని మట్టి వారు గుర్తించే దాకా వారిని వెంటాడుతూనే ఉంటుంది కదా...

ఈ కవిత్వ దారి తెలుసుకోవడానికి చేసే ప్రయత్నాలు వ్యర్థమే కదా... ఎక్కడో ఒకచోట ముగుస్తుందని, అది ఎక్కడని అన్వేషించడం వినా కవులు చేసే పని ఏముంటుంది కనుక. ఈ శ్రీధర్ బాబు కూడా అదే పని చేస్తున్నారు. కవుల్లాగే పాఠకులు కూడా ప్రశ్నిస్తారు. పైగా శ్రీధర్ బాబు అన్నట్లు మా దగ్గర ఇంకా చాలా ప్రశ్నలు ఉన్నాయంటారు. చిత్రమేమిటంటే ఈ కవులు కూడా పాఠకుల దగ్గరే తమ ప్రయాణాన్ని ప్రారంభిస్తారు. ఆ విషయం తెలుసుకునే ప్రయత్నంలోనే చాలా ఏళ్లు, వేల మైళ్లు ప్రయాణిస్తారు. అలా ప్రయాణిస్తూ పాఠకుల ప్రశ్నలకు ఇలా సమాధానం చెబుతారు. ఎలా అంటారా... ఇదిగో శ్రీధర్ బాబు అనే కవి ఇలా చెప్పినట్లుగా...

" షామ్స్ గోనె సంచీలో ముక్కలుగా సర్దుకుంటాడు
దమాస్కస్ ఎడారిలో రూమీ వెళ్తుంటాడు నీటి కుండను
మోస్తున్న ఒంటెలా అన్నాను
కాదు, ఒయాసిస్సులా మిగిలిపోయాడు
దాహార్తుల లోకంలో"

ఈ శ్రీధర్ బాబే కాదు... ఈ తెలుగులోనే కాదు... ప్రపంచంలోని కవులందరూ... అన్ని భాషల కవులు దాహార్తుల లోకంలో ఒయాసిస్సులా మిగిలిపోతారు కదా వొట్టి చేతులతో...

పద్యం దీపం కదా... అంటారు శ్రీధర్ బాబు. దీపమే కాదండీ బాబూ... దారీ తెన్నూ తెలియని ద్వీపం కూడా పద్యమే. అందుకే అందరూ కవిత్వాడవిలో కొత్త వర్షానికి పుట్టిన పిల్ల కాలువల్లా తలో దారి వెళ్లిపోతారంటాడు ఈ దారి తప్పిన శ్రీధర్ బాబు అనే కవి గారు.

నిజానికి ఈ పద్యం చదవక ముందు వరకూ శ్రీధర్ బాబు నాకు మామ. ఓరే అంటూ అని ప్రేమగా పరస్పరం పిలుచుకునేంత దగ్గరితనం. ఇదిగో "ఈ కవిత్వం ఎందుకంటే" పద్యం చదివిన తర్వాతే... నాలుగు రోజుల క్రితమే "గుండె పెండారం" అతని కాలికి తొడగాలనిపించింది. ఇక ఏకవచన ప్రయోగం ఈ కవి ముందు చెల్లదనిపించింది. ఈ శ్రీధర్‌బాబు అనే కవిలా ఎదిగితే... ఎదగగలిగితేనే ఏకవచన పిలుపు. అంత వరకూ ఈ కవి శ్రీధర్‌బాబు పాదాల దగ్గర కూర్చోవడమే. శరణుజొచ్చి...

ఇలాంటిదే మరో సందర్భం... మరో పద్యం...

మహిళాదినోత్సవం కదా.... ఉదయాన్నే తెరిచిన వాట్సాప్‌లో మరో పద్య పుష్పం కనిపించింది. బహుశా ఇదీ అముద్రితమే. అయినా మనసులో ముద్ర పడాలి తప్ప కాగితాలపై వచ్చేదంతా కవిత్వమెలా అవుతుంది. పోనీ, సామాజిక మాధ్యమాల్లో అంటారా... మయసభలో దుర్యోధనుడు రెండో సారి చూసిన సభ మధ్యమున కొలనులా "ఇదియునూ... అట్టిదియే" అనుకోవడం తప్ప మరేం చేయలేని బేలతనం. సరే, ఈ మహిళాదినోత్సవం ఉదయాన్నే కనిపించి... వరుసగా నాలుగు సార్లు చదివి "బలే ఉందమ్మా " అని స్పందించిన పద్యం డాక్టర్ కాళ్లకూరి శైలజ గారు రాసిన మగువా... మగువా...!

"నువ్వెక్కడున్నా తెలిసి పోతావు
కురవక ఆగిన కన్నీటి చుక్క
చెక్కిలి పై నీడలో దాచేస్తావు
నెమ్మదిగా వికసించే మొగ్గల పక్కన
నీ పాదముద్రలు
వెతికే వారికే దొరుకుతాయి" ఇలా ప్రారంభమైంది పద్యం.

ఎంత చక్కగా ఉందో అనిపించింది ఈ నాలుగు లైన్లు చదివాక. స్త్రీలు ఎప్పుడు కురవక ఆగిన కన్నీటి చుక్కలే. కొంగును నోటికి అడ్డం పెట్టుకునో, చున్నీని నోట్లో కుక్కుకుంటునో కనిపిస్తారు మహిళలు. కన్నీళ్లను కూడా స్వేచ్ఛగా వదలలేని అభాగ్య స్త్రీలోకం. వారిని వెతకాలంటే సాధ్యం కాదు. వికసించే మొక్కల పక్కన వారు నడిచి వెళ్లిన పాదముద్రలుంటాయి. వాటిని పురుష సమాజమే కాదు... ఆ మహిళా సమాజం కూడా గుర్తించలేదు. ప్రతీ ఏటా వచ్చే మార్చి 8 వ తేది ఇందుకు మినహాయింపు. ఈ రోజొక్కటే వారికి మిగిలిన ఆలంబన. అవును, వారంతా కవయిత్రి శైలజగారన్నట్లు

"విజయం కోసం ఎక్కాల్సిన మెట్లెన్నో
లెక్కపెట్టడం మానేసి
లాలిపాటలై పరవశిస్తారు"

సరిగ్గా ఈ పద్యం చదువుతున్నప్పుడే ఓ చానల్‌లో మల్లె తీగ వంటిదీ మగువ జీవితం అనే పాట వస్తూంటూంది. ఇదీ కాకతాళీయమే. మహిళల కవిత్వమూ, జీవితమూ రెండూ కాకతాళీయం కావడమే విషాదం కదా...

ఈ పద్యాన్ని శైలజగారు ఇలా ముగించారు...

"కింద పడ్డా పైకి లేచే బంతి' అంటే
ఆశలు నెరవేరకపోయినా
అందంగా నవ్వే,
నీ మోము జ్ఞప్తికి రావాలి" ఈ చివరి లైన్లు చాలవూ మహిళల జీవితాల గురించి చెప్పడానికి.

శ్రీధర్ బాబు గారు అన్నట్లు... శైలజ గారు చెప్పినట్లు...
కవిత్వం ఎందుకంటే.... ఇదిగో ఇందుకే... అవును ఇందుకే...

సీనియర్ జర్నలిస్టు
సెల్: 99120 19929

బెంగాల్‌లో కాంగ్రెస్ తప్పటడుగులు

- తృణమూల్‌తో పొత్తుకు ప్రయత్నం
- మొదటి ప్రాధాన్యత అయిన వామపక్షాలకు దూరం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీ తమ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తో పొత్తు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ తన మొదటి ప్రాధాన్యత అయిన వామపక్షాలను వదిలివేసి తప్పటడగులు వేస్తోంది. 'ఒక అదనపు సీటు (బెంగాల్‌లో) గెలవడం లాభమని, అది జరిగే అవకాశాలు తృణమూల్‌తో మెరుగ్గా ఉన్నాయని ఏఐసీసీ భావిస్తోంది. మేము దానితో ఏకీభవించనప్పటికీ, మనం చేయగలిగింది చాలా తక్కువ. మేము కూడా చివరి మాట వినడానికి వేచి ఉన్నాం' అని కాంగ్రెస్ కార్యకర్త ఒకరు చెప్పారు. బెంగాల్‌లో 2019లో గెలుపొందిన బెర్హంపూర్, మాల్దా దక్షిణ స్థానంతో సహా ఐదు స్థానాలకు కాంగ్రెస్ తన డిమాండ్లను తగ్గించిందని భావిస్తున్నారు అయితే టీఎంసీ డార్జిలింగ్‌తో పాటు మరో సీటును అందించే అవకాశం ఉంది. దీంతో ఈ సంఖ్య నాలుగుకు చేరుకుంది. మరోవైపు రాయ్‌గంజ్, పురులియాపై కాంగ్రెస్ పట్టుబడుతోంది. కాంగ్రెస్ పార్టీ 12 నుంచి 14 సీట్లకు డిమాండ్ చేస్తున్నప్పటికీ, రెండుకు మించి సీట్లు ఇవ్వబోమని తృణమూల్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ అనేక సార్లు బహిరంగంగానే స్పష్టం చేశారు. బెంగాల్‌లో తృణమూల్ ఒంటరిగా పోటీ చేస్తుందని, అసోంలో ఇద్దరు అభ్యర్థులను నిలబెడుతుందని తెలిపారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరిగానీ ఇతర ఢిల్లీ నాయకులెవరూ బెంగాల్‌లో తాము పోటీ చేసే సీట్ల సంఖ్య వెల్లడించలేదు. దక్షిణ బెంగాల్‌లో కూడా పార్టీకి సీట్లు కావాలనేది షరతు. ఇక అధిర్ రంజన్ చౌదరికి రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మధ్య విరోధం అందరికీ తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలకు నెలరోజుల ముందు చౌదరి తృణమూల్‌తో చేతులు కలపడం కంటే ఒంటరిగా పోటీ చేసి ఓడిపోవడమే తనకు ఇష్టమని తరచూ చెబుతూ వస్తున్నారు. మరోవైపు, జైరాం రమేశ్ వంటి ఏఐసీసీ నాయకులు ఎప్పుడూ తృణమూల్‌తో చర్చలు జరుపుతూనే ఉన్నారు. బెంగాల్ నాయకులు మమతా బెనర్జీ ప్రభుత్వంపై, ముఖ్యంగా సందేశ్‌ఖలీ అంశంపై విమర్శిస్తూనే ఉన్నందున కాంగ్రెస్ శ్రేణుల్లో గందరగోళం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో మూడు బహిరంగ సభల్లో ప్రసంగిస్తూ, తృణమూల్ కాంగ్రెస్, దాని అవినీతిపై ఆరోపణలు గుప్పిస్తూ, 'ఇండియా కూటమి'పై విమర్శలు చేశారు. 'తృణమూల్ మితిమీరిన భారాన్ని మనం మోయాల్సి వస్తుందని ఏఐసీసీ నేతలు అర్థం చేసుకోలేకపోతున్నారు. వారికి ఎన్నికల యంత్రాంగం ఉండవచ్చు. కానీ ఇతర అంశాలు కూడా ఉన్నాయి. 2011లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారు మా ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, పంచాయతీ సభ్యులను వేటాడిన తీరును, వారిపై వచ్చిన అవినీతి ఆరోపణలను మేము ఎలా మర్చిపోగలం? అని బెంగాల్‌లో కాంగ్రెస్ నేత ఒకరు అన్నారు. బెంగాల్‌లో కాంగ్రెస్ కోసం ఎదురుచూడటం వ్యర్థమని వామపక్ష పార్టీ సీపీఎం కూడా నమ్ముతోంది. 'ఓట్లు చీలిపోకుండా ఐక్యతను చాటాలి. మా వద్ద అత్యవసర ప్రణాళిక సిద్ధంగా ఉంది. ప్రజల్లో ఐక్యతను సాధించడంపై నిమగ్నమై ఉన్నాం' అని సీపీఎం నాయకుడు ఒకరు అన్నారు. సీపీఎం 2014లో గెలిచిన ముర్షిదాబాద్ స్థానం నుంచి మైనారిటీ వర్గానికి చెందిన ప్రముఖ వ్యక్తిని బరిలోకి దించే అవకాశం ఉంది. 2019లో సొంతంగా పోటీ చేసింది. బెర్హంపూర్, మాల్దా దక్షిణ సీటు... రెండు స్థానాల్లో వామపక్షాలు ఎవరినీ అభ్యర్థిగా నిలబెట్టలేదు. ఈ రెండింటిని కాంగ్రెస్‌కు వదిలివేసింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, యువనేత మీనాక్షి ముఖర్జీ సహా సీపీఎం నేతలు గురువారం ముర్షిదాబాద్‌లో సమావేశమయ్యారు. ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని రెండు సెగ్మెంట్‌లలోని హరిహరపర, డోమ్‌కల్‌లో సలీం ర్యాలీకి నాయకత్వం వహించగా, మీనాక్షి పార్టీ యువజన విభాగంతో అంతర్గత సమావేశం నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటి వరకు చౌదరి సొంతగడ్డ అయిన ముర్షిదాబాద్‌లో కూడా రాష్ట్రంలోని ఇతర చోట్ల మాదిరిగానే కాంగ్రెస్ బలం క్రమంగా క్షీణించింది. అపూర్బా సర్కార్, అబూ తాహెర్ ఖాన్, షావోనీ సింఘా రాయ్, రబీవుల్ ఆలం చౌదరి, నరుగోపాల్ ముఖర్జీ తదితరులు తృణమూల్‌లోకి వెళ్లారు. 2023లో బేరాన్ బిశ్వాస్ తృణమూల్‌కు ఫిరాయించిన చివరి వ్యక్తి. అతను వామపక్షాల మద్దతుతో సాగర్‌డిఘి ఉప ఎన్నికలో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచాడు. 47.35 శాతం ఓట్లు సాధించాడు.

పదేళ్లలో కాంగ్రెస్ నుంచి తృణమూల్‌లోకి వెళ్లిన చాలా మంది చౌదరి నాయకత్వం పట్ల అసంతృప్తితో ఉన్నారు. తమ నియోజకవర్గాల్లో ఆయనకు సన్నిహితులు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. బెర్హంపూర్ నుంచి చౌదరికి వరుసగా ఆరోసారి ప్రచారం చేస్తారా అని అడిగినప్పుడు ఒక తృణమూల్ ఎమ్మెల్యే (అంతకుముందు కాంగ్రెస్‌లో ఉన్నవారు) ఇలా అన్నారు... 'మొదట పొత్తు జరగనివ్వండి' అని తెలిపారు.

ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

బ్యాంకు ఖాతాలపై ఐటీ చర్యల నిలిపివేతకు అప్పిలేట్ ట్రిబ్యునల్ తిరస్కృతి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తమ బ్యాంకు ఖాతాలపై ఐటీ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కాంగ్రెస్ పెట్టుకున్న పిటిషన్‌ను ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ కొట్టివేసింది. హైకోర్టులో ఫిర్యాదునకు వీలుగా తీర్పుపై 10 రోజుల పాటు స్టే విధించాలని కాంగ్రెస్ పార్టీ కోరగా దానిని కూడా ట్రిబ్యునల్ తిరస్కరించింది. 2018-19 సంవత్సరానికి సంబంధించిన ఐటీ రిటర్నుల విషయంలో ఆదాయపు పన్ను విభాగం గతంలో కాంగ్రెస్‌కు అనేక నోటీసులు జారీ చేసింది. వీటికి పార్టీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో చర్యలు చేపట్టిన ఐటీ విభాగం.. ఇటీవల రూ.210 కోట్ల పన్ను రికవరీ కోసం కాంగ్రెస్ ఖాతాలను ఫ్రీజ్ చేసింది. దీనిపై పార్టీ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో స్వల్ప ఊరట లభించింది. దీనిపై తదుపరి విచారణ చేపట్టేంత వరకు బ్యాంకు ఖాతాలను యథావిధిగా నిర్వహించుకునేందుకు అనుమతినిచ్చింది. దీంతో ఆ ఖాతాలను పునరుద్ధరించారు. ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండగానే ఇటీవల ఐటీ అధికారులు తమ బ్యాంకు ఖాతాల నుంచి రూ.65కోట్లు విత్‌డ్రా చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. తమ ఖాతాలపై ఐటీ విభాగం చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఆ అభ్యర్థనను కొట్టేయడంపై త్వరలో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకేన్ తెలిపారు.

మహాశివరాత్రి వేడుకల్లో అపశృతి

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా చేపట్టిన విగ్రహాల ఊరేగింపులో అపశృతి చోటుచేసుకుంది. 15 మందికి పైగా చిన్నారులు విద్యుదాఘాతానికి గురయ్యారు. కున్హాడి థర్మల్ కూడలి సమీపంలో ఈ విషాదకర ఘటన సంభవించింది. గాయపడిన పిల్లలందరినీ చికిత్స కోసం ఎంబీఎస్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం అక్కడి నుంచి జైపూర్‌కు తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. లోక్‌సభ స్పీకర్, కోటా ఎంపీ ఓం బిర్లా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన చిన్నారులకు సరైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. రాజస్థాన్ ఇంధనశాఖ మంత్రి హీరాలాల్ ఆసుపత్రికి చేరుకున్నారు.

ఆప్ ఎన్నికల ప్రచారం ప్రారంభం

న్యూఢిల్లీ: మరికొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున రాజకీయ పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి కేంద్రీకరించాయి. ఇందులోభాగంగా ఆమ్‌ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ప్రారంభించింది. ఢిల్లీ డీడీయూ మార్గ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో ఎన్నికల ప్రచార నినాదాన్ని ప్రకటించారు. 'ఒక సామాన్యుడికి ఢిల్లీ అధికారం కట్టబెట్టారు. అందుకే మీరంటే బీజేపీకి ద్వేషం. మొహల్లా క్లినిక్‌లను బుల్డోజర్లతో కూల్చివేశారు. ఇంటింటికీ రేషన్, వైద్య పరీక్షలు, ఔషధాలు పంపిణీ చేసే పథకాలు నిలిపివేశారు. ఆప్ ప్రభుత్వం ప్రారంభించే ప్రతి ప్రాజెక్టును ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఢిల్లీలో అభివృద్ధిని అడ్డుకునే వారిని గుర్తించి తగినవిధంగా శిక్షించండి. నా కుటుంబంగా భావించే ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు అన్నివిధాలా కృషి చేశా. పార్లమెంటులోనూ కేజ్రీవాల్ ఉంటే... ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుంది అనేది మా నినాదం' అని అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ ప్రభుత్వం చేసిన పనుల కరపత్రాలను ఆప్ కార్యకర్తలు పంపిణీ చేస్తారని అన్నారు. భగవంత్ మాన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాలను ఆప్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. లోక్‌సభలో ఎంపీల సంఖ్య ఎక్కువగా ఉంటే నిధులు ఆపేందుకు ఎవరూ సాహసం చేయరన్నారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్‌తో కలిసి ఢిల్లీ, గుజరాత్, హర్యానాలలో పోటీ చేస్తున్నామని, పంజాబ్‌లో మాత్రం వేర్వేరుగా బరిలో నిలుస్తున్నట్లు చెప్పారు.

నా డిప్యూటీగా ఉంటానన్న మాన్: సిద్ధూ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ గతంలో ఒకసారి తనను కలిశారని, తనతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి కనబరిచారని సిద్ధూ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరతానని, తన డిప్యూటీగా పనిచేస్తానని చెప్పారని గుర్తుచేశారు. సిద్ధూ చేసిన ఈ వ్యాఖ్యలు పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. 'కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మీతో కలిసి పనిచేస్తా. ఒకవేళ మీరు ఆమ్ ఆద్మీ పార్టీలోకి వస్తానన్నా ఫర్లేదు. అక్కడ మీ డిప్యూటీగా పనిచేస్తానని మాన్ చెప్పారు' అని సిద్ధూ వ్యాఖ్యానించారు. సిద్ధూ కాంగ్రెస్ పార్టీ వీడతారనే ప్రచారం జరుగుతోంది. ఇంతలో ఆయన పంజాబ్ సీఎం మాన్ గురించి వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ వీడుతున్నారనే ఊహాగానాలకు సంబంధించి సిద్ధూను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటునని,. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీకి విశ్వసనీయుడినని, రాహుల్ గాంధీని విడిచి మరో పార్టీలోకి వెళ్లే ప్రశ్నే లేదని సిద్ధూ చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని మాన్ నిజంగా అనుకుంటే ఢిల్లీ వచ్చి పార్టీ పెద్దలను కలువాలని సూచించానని సిద్ధూ తెలిపారు. ఆ తర్వాత మాన్ స్పందించలేదని, పార్టీలో చేరిక గురించి మాట్లాడలేదని వెల్లడించారు.

మహిళల పట్ల మోదీ వివక్ష

జైరాం రమేశ్ విమర్శ

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వ హయాంలో కార్మికశక్తిలో మహిళల వాటా క్రమంగా తగ్గుతుందని కాంగ్రెస్ విమర్శించింది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడే అవకాశం ఉందని శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలిపింది. అంతేకాకుండా మహిళలకు సంబంధించి ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ప్రధాని మోదీని డిమాండ్ చేసింది. మోదీ నుంచి దేశ మహిళలు సమాధానం కోరుతున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రాం రమేష్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. మణిపూర్‌లో గత ఏడాది జరిగిన నేరాల్లో అనేక మంది మహిళలకు అవమానం జరిగింది. ఆ సమయంలో కొంతమంది మహిళలపై దాడులు చేసి నగ్నంగా ఊరేగించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. కానీ ఈ విషయంలో ప్రధాని మోదీ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో మణిపూర్‌లో ఎందుకు పర్యటించలేదని నిలదీశారు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారని, కానీ ఈ విషయంపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని, ఈ అంశంపై ప్రధాని వైఖరి ఏమిటని ప్రశ్నించారు. రోజురోజుకు పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి దేశ ప్రజలను కాపాడేందుకు ప్రధాని వద్ద ఏమైనా ప్రణాళిక ఉందా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాం కంటే ఇప్పుడు శ్రామిక శక్తిలో మహిళల సంఖ్య 20 శాతం తక్కువగా ఉందని గుర్తుచేశారు. ఇది ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక సామర్థ్యాన్ని దెబ్బతీసే ధోరణి అని, మహిళలను ఆర్థిక ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ప్రధానికి ఏమైనా శక్తి ఉందా అని రమేష్ ప్రశ్నించారు. దాన్ని తిరిగి తీసుకురావడానికి ఏదైనా పరిష్కారం ఉందా? అన్యాయ యుగం లక్షణాలలో ఒకటైన తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభం విషయంలో ఏదైనా చర్యలు తీసుకున్నారా అని అడిగారు. ఆ క్రమంలో ఉద్యోగాన్వేషణలో భాగంగా మహిళలకు ఉపాధి లభించకుండా నిరుత్సాహపడుతున్నారని చెప్పారు.

2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధానమంత్రి 'బేటీ బచావో బేటీ పఢావో' పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. ఆడపిల్లల భ్రూణహత్యలను అరికట్టడానికి, మహిళా విద్యను ప్రోత్సహించడానికి ప్రధానికి ఏదైనా అర్థవంతమైన దృక్పథం ఉందా అని రమేష్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో భారతీయ మహిళలు ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారని, బీజేపీని తొలగించి, ఆడపిల్లను రక్షించాలని రమేష్ కోరారు.

బరిసిత్ బరిలో బీజేపీ తరపున షమీ?

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌పై బీజేపీ దృష్టి కేంద్రీకరించింది. ఇటీవల బెంగాల్‌లో వరసగా ప్రధాని మోదీ పర్యటించడం, కోల్ కతా హైకోర్టు మాజీ జడ్జీ అభిజిత్ గంగోపాధ్యాయ బీజేపీలో చేరడంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో సత్తా చాటాలని బీజేపీ వ్యూహాలు రచిస్తోంది. దానికి కొనసాగింపుగా బీజేపీ మరో ఎత్తుగడ వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో క్రికెటర్ మహ్మద్ షమీని బరిలోకి దింపాలని బీజేపీ భావిస్తోంది. ఇటీవల ఘర్షణలకు కేంద్రంగా నిలిచిన సందేశ్‌ఖలి పరిధిలో గల బరిసిత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి షమీని బరిలో దింపాలని యోచిస్తోంది. బెంగాల్ గడ్డపై షమీ విజయంతో తమ ఖాతా తెరవాలని ఊబలాట పడుతోంది. బరిసిత్‌లో మైనార్టీల సంఖ్య ఎక్కువ అని, షమీ బరిలోకి దిగితే విజయం ఖాయమని స్థానిక బీజేపీ నేతలు నమ్ముతున్నారు. ఇటీవల జరిగిన వరల్డ్ కప్‌లో షమీ అద్భుత ప్రదర్శన చేశాడు. ఫైనల్‌లో మ్యాచ్ ఓడిన తర్వాత... డ్రెస్సింగ్ రూమ్ వద్దకు వెళ్లిన ప్రధాని మోదీ...టీమిండియా సభ్యులను ఓదార్చారు. ఆ సమయంలో షమీని ప్రత్యేకంగా అభినందించారు. చాలా చక్కగా ఆడావని ప్రశంసించారు. ఆ తర్వాత మహ్మద్ షమీ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. దీంతో బీజేపీలో చేరడమో... లేదంటే ప్రచారం చేస్తారని భావించారు. అనూహ్యంగా లోక్‌సభ బరిలో నిలుపుతామని బీజేపీ పెద్దలు చెబుతున్నారు. మహ్మద్ షమీకి బెంగాల్‌తో అనుబంధం ఉంది. బెంగాల్ తరపున రంజీ మ్యాచ్‌లు ఆడతారు. షమీని లోక్‌సభ నుంచి బరిలోకి దింపుతారనే ఊహాగానాలు వెలువడుతున్న వేళ... ఆయన స్వగ్రామం అమ్రోహాలో స్టేడియం నిర్మిస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటన చేశారు.

ప్రభుత్వాలను విమర్శించడం నేరం కాదు

సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దుచేయడాన్ని నిరసిస్తూ బ్లాక్ డేగా పేర్కొనడం నేరం కాదని సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని స్పష్టం చేసింది. ఇతర దేశాల స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ఆ దేశాల పౌరులకు శుభాకాంక్షలు చెప్పడం తప్పేమీ కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఆర్టికల్ 370 రద్దును విమర్శిస్తూ వాట్సప్ స్టేటస్ పెట్టుకున్న ప్రొఫెసర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన జావేద్ అహ్మద్ హాజం అనే ప్రొఫెసర్... ఆర్టికల్ 370 రద్దును విమర్శిస్తూ ఆగస్టు 5ను జమ్మూ కశ్మీర్‌కు బ్లాక్ డేగా పేర్కొన్నారు. ఆగస్టు 14న పాకిస్థాన్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు అంటూ వాట్సప్ స్టేటస్ పెట్టుకున్నారు. దీనిని నేరంగా పరిగణిస్తూ ఆయనపై సెక్షన్ 153ఏ (మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం) కింద కేసు నమోదు చేశారు. అయితే, తనపై కేసును కొట్టివేయాలని బాంబే హైకోర్టును హాజం ఆశ్రయించగా... అక్కడ చుక్కెదురైంది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హాజం పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. బాంబే హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ దేశ పౌరులకు శుభాకాంక్షలు చెప్పడం తప్పుకాదని, ఇది సద్భావనకు సంకేతమని స్పష్టంచేసింది. ఇదేమీ రెండు మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంచే చర్య కాదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు హామీ ఇస్తుందని, దీనిద్వారా ఆర్టికల్ 370 రద్దును విమర్శించే హక్కు దేశంలోని ప్రతి పౌరుడికీ ఉంటుందని పేర్కొంది. ఆర్టికల్ రద్దు చేసిన రోజును బ్లాక్ డేగా పేర్కొనడంతో హాజం తన నిరసనను, ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. ఇలాంటి ప్రతి చర్యనూ సెక్షన్ 153ఏ ద్వారా అడ్డుకుంటే ప్రజాస్వామ్యం మనుగడ అసాధ్యమని, చట్టబద్ధ నిరసన తెలిపే హక్కు ఆర్టికల్ 19(1)(ఏ) కల్పిస్తుందని గుర్తుచేసింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్య అవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుతం కేసులో హాజం రాజ్యాంగ హక్కుల పరిధిని దాటలేదని పేర్కొంది. భారత్ 75 ఏళ్లకుపైగా ప్రజాసామ్య గణతంత్ర దేశమని, ప్రజలకు ప్రజాస్వామ్య విలువలేంటో తెలుసు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వివిధ మత సమూహాల మధ్య అసమానత లేదా శత్రుత్వం, ద్వేషం లేదా దుష్ప్రవర్తన వంటి భావాలను ఇలాంటి పదాలు ప్రోత్సహిస్తాయని నిర్ధారించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది.

బెంగళూరుకు నీటి కరువు

బెంగళూరు: వేసవికాలం మొదలుకాకముందే కర్నాటక రాజధాని బెంగళూరును నీటి సమస్య పట్టి పీడిస్తోంది. బెంగళూరులోని ప్రెస్టీజ్ ఫాల్కన్ సిటీలో నివసిస్తున్న ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తమ అపార్ట్‌మెంట్‌లో నీటి కొరత ఏర్పడిందని, దీంతో సమీపంలోని ఓ మాల్‌కి వెళ్లి మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నామని అతను పోస్ట్‌లో చెప్పాడు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో ప్రెస్టీజ్ ఫాల్కన్ అధికారులు స్పందించారు. అపార్ట్‌మెంట్ వాసులు మాల్‌లలో బాత్రూమ్‌లు ఉపయోగించుకుంటున్నారనేది పూర్తిగా అవాస్తవమని చెప్పారు. వారు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు. తీవ్ర నీటి సంక్షోభంతో బెంగళూరు వాసులు నిరాశ, భయం, ఆందోళనలో మునిగిపోయారు. నీటి కొరతపై సోషల్ మీడియాలో పోస్టలతో ముంచెత్తారు. భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి సంక్షోభం తలెత్తిందని నగర వాసులు తమ బాధలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. మున్సిపల్ వాటర్ ట్యాంకుల వద్ద పొడవైన క్యూలు సర్వసాధారణమయ్యాయి. అయితే కొందరు డబ్బులు వెచ్చించి నీటి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నా... అవీ సరిపోకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు. కరువు పరిస్థితులపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. రాష్ట్రంలోని 136 తాలూకాల్లో 123 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించామని, 109 తాలూకాలు కరువుతో అల్లాడుతున్నాయని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ రాజధానిలో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇకపై బెంగళూరులో కార్ వాషింగ్, గార్డెనింగ్, నిర్మాణం, వాటర్ ఫౌంటైన్లు, రోడ్ల నిర్మాణం వంటి పనులకు తాగునీటిని ఉపయోగించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని కర్నాటక నీటి సరఫరా, మురుగునీటి బోర్డు ప్రకటించింది. బోర్‌వెల్‌లు ఎండిపోవడంతోనే నీటి ఎద్దడి ఏర్పడిందని, వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటాయని నిపుణులు చెబుతున్నారు.

తండ్రి చేతిలో కుమారుడి హతం

న్యూఢిల్లీ: మరికొన్ని గంటల్లో పెళ్లి జరగాల్సిన కుమారుడుని స్వయానా తండ్రే హతమార్చిన ఘటన ఢిల్లీలో చోటుచేసుకుంది. గౌరవ్‌సంఘాల్(29) అనే యువకుడు ఢిల్లీలో జిమ్ నడుపుతున్నాడు. గురువారం అతనికి వివాహం నిశ్చయించారు. మరికొన్ని గంటల్లో పెళ్లి జరగనుండగా తండ్రీ కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రతిరోజు తనతో గొడవపడుతున్నాడనే కోపంతో తండ్రి రంగలాల్ కుమారుడిని 15సార్లు కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం పారిపోయాడు. సంగీత వాయిద్యాల చప్పుడు ఎక్కువగా ఉండడంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. వివాహ ఊరేగింపు కోసం వరుడిని వెతుకుతున్న బంధువులకు అతడు రక్తపు మడుగులో కనిపించడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ యువకుడు మరణించాడని, గాలింపుచర్యల అనంతరం అతని తండ్రిని అదుపులోకి తీసుకున్నామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అంకిత్ చౌహాన్ తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు హత్య చేసినట్లుగా అంగీకరించినట్లు చెప్పారు.

మళ్లీ బీజేపీదే అధికారం: మోదీ

న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్రమోదీ ధీమా వ్యక్తంచేశారు. 2014, 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని మోదీ పునరుద్ఘాటించారు. ఢిల్లీలోని భారత మండపంలో 'నేషనల్ క్రియేటర్స్ అవార్డు'లను ఆయన శుక్రవారం అందజేశారు. సృజనాత్మక వీడియోలు, కథనాలతో సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను నూతనంగా ప్రవేశపెట్టింది. స్టోరీ టెల్లింగ్, సామాజిక మార్పు, పర్యావరణ పరిరక్షణ, విద్య, గేమింగ్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి, ప్రోత్సహించడమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశమని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మహిళా దినోత్సవం, శివరాత్రి రోజున ఈ అవార్డులు ప్రారంభించడం సంతోషంగా ఉందని మోదీ తెలిపారు. విజేతలకు అభినందనలు చెప్పారు. సృజనాత్మకతతో ఈ రోజు మీరంతా ఇక్కడిదాకా చేరుకున్నారని, భారత్ భవిష్యత్తు గురించి చర్చించేందుకే మనమంతా ఇక్కడ సమావేశమయ్యామని, పరిస్థితులకు అనుగుణంగా వచ్చే మార్పులను స్వీకరించడం మన బాధ్యతని పేర్కొన్నారు. తక్కువ ధరకు డేటా, మొబైల్ ఫోన్లు లభిస్తుండటంతో ఎంతోమంది కంటెంట్ క్రియేటర్లకు అవకాశం లభిస్తోందని, ఈ అవార్డులు దేశంలోని ప్రతి యువ కంటెంట్ క్రియేటర్ ప్రతిభకు నిదర్శనమన్నారు. గత ఎన్నికల్లో మాదిరే ఈ సారి బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని చెప్పారు. స్వచ్ఛ అంబాసిడర్ అవార్డు అందుకున్న మల్హార్ కలాంబేను ఉద్దేశించి సన్నగా కనిపిస్తున్నావ్... బాగా తినాలని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ అవార్డుల కోసం 20 విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1.5 లక్షల నామినేషన్స్ వచ్చాయి. వారికి మద్దతుగా పది లక్షల మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులోంచి 23 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు అంతర్జాతీయ క్రియేటర్స్ ఉన్నారు. మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ అవార్డును మహిళల విభాగంలో శ్రద్ధ, పురుషుల విభాగంలో ఆర్జే రౌనాక్ అందుకున్నారు.

25 నుంచి మోదీ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల యుద్ధానికి ప్రధాని నరేంద్రమోదీ సిద్ధమవుతున్నారు. 370 సీట్లలో విజయమే లక్ష్యంగా ఆయన ప్రచారం సాగించనున్నారు. ఆయనతోపాటు బీజేపీ అగ్రనేతలు దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రచారం ప్రారంభించనున్నారు. మార్చి 25న హోలీ పండగ ముగిశాక మోదీ ప్రచార బరిలో దిగే అవకాశం ఉంది. ఎన్నికల సభలతో పాటు చాలాచోట్ల రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 150 సభలు, రోడ్ షోలు నిర్వహించేలా బీజేపీ నాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దక్షిణ భారత్‌లో 35 – 40 సభలు, ర్యాలీలు, అసోంలో 1- 2సభలు, యూపీలో 15 కంటే ఎక్కువ సభలు, రోడ్ షోలు మిగిలిన రాష్ట్రాల్లో ప్రాధాన్యత క్రమంలో సభలు నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ వారణాసిలో నామినేషన్ సమర్పించిన అనంతరం అక్కడే రోడ్ షో నిర్వహించేలా బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. మోదీ సహా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యూపీ సహా దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, అసోం సీఎం హేమంత్ బిస్వ శర్మ యూపీ, బీహార్‌లో ప్రచారంలో పాల్గొంటారు. ఏకకాలంలో అనేక ప్రాంతాలను చుడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని బీజేపీ భావిస్తోంది.

కులం నుంచి 8 కుటుంబాల వెలి

అనకాపల్లి జిల్లాలో అమానుష ఘటన
హత్య కేసులో ఉన్నందుకేనట...
మాట్లాడితే రూ.5 వేల జరిమానా

విశాలాంధ్ర-పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): ఒక హత్య కేసులో ఉన్న 8 కుటుంబాలను వెలి వేస్తూ కుల పెద్దలు నిర్ణయం తీసుకున్న ఘటన అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసింది. పాయకరావుపేట మండలంలోని పెదరామభద్రాపురంలో జరిగిన హత్యకు సంబంధించిన కేసులో అరెస్టయి జైలులో ఉన్న 8 మంది నిందితుల కుటుంబాలను వెలి వేశారని ఆ కుటుంబాలకు చెందిన మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... పెదరామభద్రాపురంలో జనవరి 11వ తేదీన గంపల నూకరాజు హత్యకు గురయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిర్వహించి 15 మంది అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కుల పెద్దలు ఏర్పాటు చేసుకున్న సంఘం సమావేశం నిర్వహించి హత్య కేసులో పోలీసులు అరెస్టు చేసిన శీలి నాగేశ్వరరావు, శీలి అప్పారావు, శీలి సత్తిబాబు, శీలి అర్జున్, శీలి సూరిబాబు, శీలి నూకరాజు, మిరియాల వెంకటలక్ష్మి కుటుంబాలను కులం నుంచి వెలి వేయాలని నిర్ణయించారు. ఆ విషయాన్ని ఇంటింటికీ తిరిగి తెలియజేయడంతో పాటు వెలి వేసిన వారితో ఎవరైనా మాట్లాడితే రూ.5 వేలు జరిమానా వేస్తామని ప్రకటించారని బాధిత మహిళలు తెలిపారు. కుటుంబ యజమానులు రిమాండ్‌లో జైలులో ఉన్నారని, తమను కులం నుంచి వెలి వేయడం వలన పనులు కూడా ఎవరూ చెప్పడం లేదని ఆ కుటుంబాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటారు సైకిల్ తగులబెట్టిన దుండగులు

గ్రామంలో తెల్లవారుజామున శీలి అర్జున్‌కు చెందిన మోటారుసైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టినట్లు అర్జున్ భార్య అమ్మాజి తెలిపారు. వెలి వేసిన విషయాన్ని, మోటారు సైకిల్ దగ్ధం చేసిన విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శీలి అమ్మాజి, శీలి సుశీల, మిరయాల వెంకటలక్ష్మి, శీలి వెంకటలక్ష్మి తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

విశాలాంధ్రలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర కార్యాలయంలో మహిళా పాత్రికేయుల అధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. వై.శాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.మీనా మాట్లాడుతూ మహిళలు ఇంటా బయటా అనేక విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఇంటి పనుల్లో సాయం చేయాలనే ఆలోచన పురుషుల్లో రావాల్సి ఉందన్నారు. ఈ.రోమిల మాట్లాడుతూ సంప్రదాయంగా, సామాజికంగా, రాజకీయంగా మహిళలపై వివక్ష నేటికీ కొనసాగటం విచారకరమన్నారు. పి.షాయిస్తా ఖానూమ్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళల పట్ల వివక్ష కొనసాగినంత కాలం సమాజంలో మార్పు రాదన్నారు. మహిళల్ని గౌరవించే సంస్కృతి ఇంట్లోనే ప్రారంభం కావాలన్నారు. సీనియర్ పాత్రికేయులు టీవీ సుబ్బయ్య మాట్లాడుతూ పాలకుల్లో చిత్తశుద్ధి లేని కారణంగా స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మహిళలపై పూర్వకాలపు అణిచివేత ధోరణులు కొనసాగుతున్నాయన్నారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మహిళల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టీ.యోగిత, బీఎల్ చందన, ఆర్.చంద్ర, డి.జ్యోతి విశాలాంధ్ర ఎంప్లాయాస్ యూనియన్ కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, సీపీఐ విశాలాంధ్ర శాఖ కార్యదర్శి మధుసూదనరావు, స్టేట్ బ్యూరో చావా రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీటు ఎవరికిచ్చినా గెలిపించాలి

త్యాగాలకు సిద్ధపడిన నేతలందరికీ న్యాయం చేస్తా
టీడీపీ నేతలతో దిల్లీ నుంచి చంద్రబాబు దిశానిర్దేశం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎన్నికల పొత్తుల నేపథ్యంలో సీటు ఎవరికి కేటాయించినా అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులను కోరారు. ప్రస్తుతం దిల్లీలో బీజేపీకి కేటాయించే సీట్లపై చర్చలు కొనసాగిస్తూనే టెలికాన్ఫరెన్స్ ద్వారా పార్టీ ముఖ్య నేతలు, వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలతో చంద్రబాబు శుక్రవారం మాట్లాడారు. దాదాపు 12 నియోజకవర్గాల నేతలతో స్వయంగా మాట్లాడి ఎన్నికలకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకునే నిర్ణయాలను నాయకులు అర్థం చేసుకొని కలిసి పనిచేయాలని కోరారు. యర్రగొండపాలెంలో పార్టీ నేతలు మన్నె రవీంద్ర, ఎరిక్సన్ బాబు కలిసి పనిచేయాలని సూచించారు. పార్వతీపురం నియోజకవర్గ నేతలు విజయ్, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్‌లతో చర్చించారు. విజయ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. నంద్యాలలో ఫరూక్‌కు సహకరించాలని బ్రహ్మానందరెడ్డికి సూచించారు. కల్యాణదుర్గంలో సీటు దక్కించుకున్న సురేంద్రబాబుకు పూర్తి సహకారం అందించాలని ఉమామహేశ్వరనాయుడు, హనుమంతరాయ చౌదరిలను ఆదేశించారు. కురుపాం నేత దత్తి లక్ష్మణరావుతో ఫోన్‌లో మాట్లాడిన చంద్రబాబు... పార్టీ అభ్యర్థి టీ.జగదీశ్వరి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా లక్ష్మణరావును నియమించారు. పార్టీ కోసం పనిచేయాలని చిత్తూరు జిల్లా నేత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్‌కు సూచించారు. ఉంగుటూరు ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు, పిఠాపురం వర్మ, పోలవరం బొరగం శ్రీనివాస్, నర్సాపురం పొత్తూరి రామరాజు, కాకినాడ రూరల్‌లో పిల్లి సత్యనారాయణమూర్తి, తాడేపల్లిగూడెం వలవల బాబ్జీలతో మాట్లాడారు. పొత్తులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి సీటు వచ్చినా గెలిపించేందుకు పనిచేయాలని, పొత్తు ధర్మాన్ని కచ్చితంగా పాటించాలని కోరారు. సీటు దక్కని ప్రతి ఒక్కరికీ పార్టీ న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. స్వయంగా చంద్రబాబు మాట్లాడటంతో పార్టీ కోసం పనిచేస్తామని నేతలు స్పష్టం చేశారు.

ఆడబిడ్డల కోసం 'కలలకు రెక్కలు'

మహిళా సోదరీమణులకు చంద్రబాబు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలంటే సమాజంలో సగం జనాభా మాత్రమే కాదు, సమాజ శక్తిలో సగం. అందుకే మహిళలను తోబుట్టువుల్లా చూసిన ఏకైక పార్టీ తెలుగుదేశం. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారిలో ఆత్మవిశ్వాసం నింపి, ఆర్థిక స్వావలంబనకు నిరంతరం పని చేసింది తెలుగుదేశం. విద్య, ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపింది తెలుగుదేశం. నేడు మళ్లీ మహిళలను మహాశక్తులుగా మార్చేందుకు హామీ ఇచ్చిందే మహాశక్తి పథకం. ఈ పథకం కింద ఇంట్లో చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ 15,000 చొప్పున ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు చొప్పున అందిస్తాం. ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా మన ఆడబిడ్డలు ఇంటికే పరిమితం కాకూడదన్న ఆశయంతో 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని మన ప్రభుత్వం వచ్చాక అమలుచేయబోతున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేసుకున్న ఆడబిడ్డలు పై చదువులు చదివేందుకు తీసుకునే రుణాలకు ప్రభుత్వమే పూచీకత్తుగా ఉంటుంది. అంతేకాకుండా కోర్సు కాలానికి రుణంపై వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుంది. కలలకు రెక్కలు పథకంలో మీ పేరును ఇప్పుడే నమోదు చేసుకోవచ్చు. అందుకోసం కలలకు రెక్కలు వెబ్‌సైట్‌కు వెళ్లాలని చంద్రబాబు సూచించారు.

నమాజ్‌లో ఉన్న వారిపై ఖాకీ క్రౌర్యం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అమానవీయ ఘటన జరిగింది. నమాజ్‌లో ఉన్న కొందరిపై ఓ పోలీసు భౌతిక దాడికి దిగారు. శుక్రవారం ప్రార్థన సమయంలో మసీదులో చోటు లేక కొందరు రోడ్డు పక్కన నమాజ్ చేసుండాన్ని గమనించిన పోలీసు... వారిని కాళ్లతో తన్ని, మెడ పట్టుకొని పక్కకు లాగేందుకు యత్నించారు. ఇందుకు సంబంధించిన 36 సెకన్ల నిడివిగల వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ ఘటన ఇంద్రలోక్ ప్రాంతంలో జరిగింది. అక్కడున్న కొందరు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారితోనూ ఆ పోలీసు వాగ్వాదానికి దిగారు. ఈ వీడియో చూసిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (దిల్లీ నార్త్) ఎంకే మీనా స్పందిస్తూ వీడియోలో ఉన్నది పోలీసు పోస్ట్ ఇన్‌చార్జి అని, ఆయనను అప్పటికప్పుడు సస్పెండ్ చేశారని చెప్పారు. క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని, శాఖాపరమైన విచారణకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పోలీసు తీరుతో ఆగ్రహించిన స్థానికులు కొద్దిసేపు రహదారిని దిగ్బంధించారు. ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో శాంతి భద్రతల సమస్యల తలెత్తకుండా ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటన సిగ్గుచేటని కాంగ్రెస్ దిల్లీ శాఖ దుయ్యబట్టింది. 'నమాజ్ చేసే వారిని దిల్లీ పోలీసు కాళ్లతో కొట్టడం కంటే సిగ్గుచేటు మరేమైనా ఉంటుందా?' అని విమర్శించింది.

'నారీ శక్తి' సాధికారత ఎప్పుడు?

- నేటికీ అపరిష్కృతంగానే ప్రధాన సమస్యలు
- కొనసాగుతున్న లింగ వివక్ష-అణచివేత
- చట్టసభల్లో, ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల్లో కొరవడిన ప్రాతినిధ్యం

న్యూదిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో 'నారీ శక్తి' నినాదానికి ప్రాధాన్యత ఏర్పడింది. మహిళల సమస్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కానీ ఇది కేవలం నినాదమే లేక ఆ దిశగా చర్యలు ఉంటాయా... సాధికరత నిజంగా జరుగుతుందా అన్నది ప్రశ్నార్థకమైంది. స్వాతంత్ర్యం సిద్ధించిన 75 ఏళ్ల తర్వాత కూడా మహిళలు తమ హక్కుల కోసం పోరాడాల్సి వస్తోంది. నేటికీ అనేక ప్రధాన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. లింగ వివక్ష, అణచివేత, అసమానత్వం, వేధింపులు, అత్యాచారాలు వంటివి పెద్ద సవాళ్లుగా మారాయి. కాబట్టి సామాజికంగానే కాదు రాజకీయంగానూ సాధికారత అవశ్యం. లింగాధారిత విధానాలు తీసుకురావడం అనివార్యం. ఇందుకోసం రాజకీయ పార్టీల కృషి అవసరం. కంటి తుడుపు చర్యలు కాకుండా పటిష్ఠ కార్యచరణ, అజెండాతో నిజమైన మహిళా సాధికారత కోసం కృషి చేయడం ఎంతైనా అవసరమని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీటీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా అన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా అజెండాలు, మేనిఫెస్టోలు రూపొందించాలని పార్టీలకు సూచించారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలన్నారు. వారి గళాన్ని వినాలని, తదనుగుణంగా విధానాల రూపకల్పన, నిర్ణయాలు జరగాలని నొక్కిచెప్పారు. మంత్రి వర్గంలో, కీలకమైన ప్రభుత్వ కార్యాలయాల్లో మరింత ఎక్కువగా మహిళలు ఉండటం అవసరమన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును గతేడాదిలో పార్లమెంటు ఆమోదించింది కానీ ఈసారి జరిగే ఎన్నికల్లో అది అమలు జరిగే పరిస్థితి లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తమైంది. మహిళల ప్రధాన సమస్యలకు పరిష్కారం కోసం రాజకీయ పార్టీలు, నాయకులు తగిన విధానాలను రూపొందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముత్రేజా అన్నారు. ఎన్జీవో 'ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా' జెండర్ లీడ్ సీమా భాస్కరన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రస్తావించారు. ర్వాండా వంటి దేశాలు ఇటువంటి శాసనాలు చేసినట్లు తెలిపారు. 2003లో ర్వాండా రాజ్యాంగం రాజకీయాల్లో మహిళలకు 30శాతం కోటా ఇచ్చింది. పదేళ్ల తర్వాత రాజకీయాల్లో లింగ సమానత్వం సాధించిన తొలి దేశంగా నిలిచిందని ఆమె చెప్పారు. బీహార్‌లోని, గయా సర్పంచ్ డాలీ వర్మ మాట్లాడుతూ సర్పంచ్‌గా రెండుసార్లు బాధ్యతలు చేపట్టానని, పదువుల్లో ఉండటం వల్ల మహిళలు గొప్ప నాయకులుగా ఎదగగలరని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికైన మహిళా ప్రతినిధులకు అనేక సవాళ్లు ఎదురవుతాయని చెప్పారు. మహిళా సర్పంచ్‌లను మగ సర్పంచ్‌లు చిన్నచూపు చూస్తారని లింగ వివక్ష, అసమానత్వాన్ని ప్రస్తావించారు. పితృస్వామ్య సమాజం కాబట్టి మహిళలను రాజకీయ నాయకులుగా, ఎన్నికైన ప్రతినిధులుగా స్వీకరించలేకపోతున్నారని చెప్పారు. సామాజిక దృక్పథం మారాలని, ఇందుకోసం మరింత ఎక్కువ మంది మహిళలు స్వతంత్ర-శక్తిమంతమైన రాజకీయ నాయకులు, మంత్రులు ఎదగాలని నొక్కిచెప్పారు. బాలికలు విద్యావంతులై రాబోయే రోజుల్లో మరింత సాధికారత సాధిస్తారని ఆకాంక్షించారు. సమీప భవిష్యత్‌లో సమాజంలో మార్పు రావడం తథ్యమన్నారు. కాగా, గత సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 222 మంది మహిళలు స్వతంత్రంగా పోటీ చేశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో 'నారీ శక్తి'కి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే రాజకీయ పార్టీలు కేవలం నినాదాలిస్తారా లేక పటిష్ఠ చర్యలు తీసుకుంటారా అన్న ప్రశ్న తెరపైకొచ్చింది. లింగ సమానత్వానికి రాజకీయ పార్టీలు ఏ మేరకు కట్టుబడతాయి... మహిళా అభ్యర్థులకు ఎన్ని టికెట్లు ఇస్తాయన్నది వేచి చూడాల్సిందే!

కలెక్టర్ ఆదేశాలతో ఖర్చు పెట్టేశాం...

- సీఎం సభకు మండల పరిషత్ నిధుల వినియోగం
- సామాజిక కార్యకర్తకు లిఖితపూర్వక సమాచారం
- స.హ. చట్టం ద్వారా వివరాలు వెల్లడి
- 'విశాలాంధ్ర' కథనంపై స్పందించిన అధికారులు



విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: 'నిబంధనలకు విరుద్ధంగా నిధుల ఖర్చు' అన్న శీర్షికన విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలో సీఎం జగన్ సభ నిర్వహిస్తే... జనాన్ని తరలించేందుకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తాము మండల పరిషత్ నిధుల నుంచి రూ.లక్షల్లో ఖర్చు పెట్టామని అధికారులు వెల్లడించారు. నిధుల ఖర్చుపై జనసేన నేతలు ఆందోళన చేపట్టడంతోపాటు అదే మండలానికి చెందిన బొట్ల శివ సత్యనారాయణ అనే సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులను ప్రశ్నించగా, వారు ఇది నిజమేనంటూ శుక్రవారం ఆయనకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.గత ఏడాది మార్చి 19న సీఎం జగన్ జగనన్న విద్యాదీవెన బహిరంగ సభ తిరువూరులో నిర్వహించారు. విస్సన్నపేట మండలం నుంచి తరలివెళ్లిన 4,020 మందికి అల్పాహారం, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు, రవాణా ఖర్చులకు మండల పరిషత్ నిధులు వినియోగించామన్నారు. అల్పాహారానికి రూ.1,80,900, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు, అరటిపండ్లకు రూ.56,280, వాహన చార్జీలకు రూ.36 వేలు చెల్లించినట్లు పేర్కొన్నారు. వీటన్నింటినీ బి.రమేశ్ అనే క్యాటరింగ్ కాంట్రాక్టరుకు అప్పగించామని వివరించారు. ఆర్‌సి నెం.6/611/2023,15.3.2023న కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కానందున, మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి చెల్లించటం జరిగిందని పేర్కొన్నారు.

అనుమానాలు... అసంపూర్తి సమాచారం

కాగా, అధికారులు స.హ. చట్టం కార్యకర్తకు ఇచ్చిన సమాచారం అసంపూర్తిగా ఉండటంతోపాటు, పలు అనుమానాలకు తావిచ్చేదిగా ఉంది. బి.రమేశ్‌కు కాంట్రాక్టు ఇచ్చామని పేర్కొన్నారు. అల్పాహారం పంపిణీ నిమిత్తం అభిరుచి రెస్టారెంట్ యజమాని రమేశ్‌కు రూ.1,80,900 చెల్లించినట్లు రసీదు చూపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని శ్రీలక్ష్మి స్వీట్‌షాపు యజమాని వి.రాము మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేయగా, రూ.56,280 చెల్లించినట్లు చూపారు. రవాణా ఖర్చు నిమిత్తం రూ.36 వేలు చెల్లించినట్లు టి.శివకుమార్ అనే వ్యక్తి సంతకం చేసిన ఓచరు చూపారు. ఆశ్చర్యమేమంటే ఇవన్నీ ఒకే చేతిరాతతో రాసి ఉండటం విశేషం. వీరందరికీ బి.రాంబాబు అనే వ్యక్తి నగదు చెల్లించినట్లు సంతకం చేశారు. అసలు రాంబాబు ఎవరు, మండల పరిషత్తులో అతని హోదా ఏమిటో స్పష్టత లేదు. కాంట్రాక్టర్ రమేశ్‌కు చెల్లించాల్సిన నగదును ముగ్గురికి ఎందుకు చెల్లించారు? అనే విషయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిల్లులు, ఓచర్లపై తేదీ వేయకుండా కేవలం 3/2023 అని మాత్రమే నమోదు చేయటంతో ఏ తేదీన సాధారణ నిధులు డ్రా చేశారనే విషయమై స్పష్టత లేదు. పైగా నగదు చెల్లింపులేవీ సీఎఫ్ఎంఎస్ విధానంలో జరగకపోవటం కూడా అనుమానాలకు తావిస్తోంది. అర్జీదారు కోరిన నిధులు డ్రా చేసిన విషయానికి సంబంధించి క్యాష్‌బుక్, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఏమీ ఇవ్వలేదు. ముఖ్యమంత్రి పొరుగు మండలంలో సభ నిర్వహిస్తే ఇక్కడి అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులను అధికారులు ఇష్టానుసారం ఖర్చు చేసిన విషయమై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంకా ఏఏ సభలకు మండల పరిషత్‌ల నుంచి నిధులు ఖర్చు పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

93 ఏళ్ల వయసులో మర్డోక్ ఐదో పెళ్లి

వాషింగ్టన్: ప్రముఖ ఆస్ట్రేలియన్-అమెరికన్ వ్యాపారవేత్త, మీడియా దిగ్గజం రూపర్ట్ మర్డోక్ 93 ఏళ్ల వయసులో ఐదోసారి పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలే తన ప్రియురాలైన 67 ఏళ్ల ఎలీనా జుకోవాతో నిశ్చితార్థం చేసుకున్నారు. జూన్‌లో కాలిఫోర్నియాలోని తన ఎస్టేట్‌లో వివాహం జరగనున్నది. ఆహ్వాన పత్రికల పంపిణీ ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపింది. గతేడాది ఆన్ లెస్లీ స్మిత్‌తో మర్డోక్‌కు నిశ్చితార్థం జరిగింది కానీ కేవలం నెలలోనే ఆ బంధం తెగిపోయింది. కొన్ని నెలలకు మాజీ భార్య విన్‌డీ డెంగ్ ఇచ్చిన పార్టీలో జుకోవాతో పరిచయం... పెళ్లి వరకు వచ్చింది. మర్డోక్ ఇంతకుముందు పాట్రిషియా బుకర్, జర్నలిస్ట్ అన్నా మరియా మన్, చైనా వ్యాపారవేత్త విన్‌డీ డెంగ్, అమెరికా మోడల్ జెర్రీ హాల్‌ను పెళ్లి చేసుకున్నారు. 1950ల్లో మీడియా కెరీర్‌ను ఆరంభించిన మర్డోక్.. న్యూస్ ఆఫ్ ది వరల్డ్, ది సన్ పత్రికలను ప్రారంభించారు. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడి న్యూయార్క్ పోస్ట్, వాల్ స్ట్రీట్ జర్నల్ వంటి వార్తా సంస్థలను కొనుగోలు చేశారు. 1996లో ఫాక్స్ న్యూస్‌ను ప్రారంభించారు. 2013లో న్యూస్‌కార్ప్‌ను స్థాపించారు. మర్డోక్ తన కెరీర్‌లో అనేక వివాదాలు ఎదుర్కొన్నారు. 2011లో న్యూస్ ఆఫ్ ది వరల్డ్‌ను మూసివేశారు. వ్యాపార సామ్రాజ్యాన్ని కుమారులకు అప్పగించిన ఆయన ప్రస్తుతం గౌరవ చైర్మన్‌గా ఉన్నారు.

భారత్ ఆధిక్యం 255 పరుగులు

- రోహిత్, శుభ్‌మన్ సెంచరీలు
- తొలి ఇన్నింగ్స్ 473/8
- ఆధిక్యం దిశగా టీమ్ ఇండియా
- ముగిసిన రెండో రోజు ఆట

ధర్మశాల: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదో క్రికెట్ టెస్టు రెండో రోజు ఆటలో భారత్ ఆధిపత్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ ఇండియా భారీ లీడ్‌లోకి దూసుకెళ్లింది. ఆట ముగిసే సమయానికి భారత్ 8 వికెట్ల నష్టానికి 473 పరుగులు చేసింది. క్రీజ్‌లో కుల్‌దీప్ యాదవ్ (27), జస్‌ప్రీత్ బుమ్రా (19) ఉన్నారు. అంతకుముందు రోహిత్ శర్మ (103), శుభ్‌మన్ గిల్ (110) సెంచరీలతో కదం తొక్కారు. యశస్వి జైస్వాల్ (57), దేవదుత్ పడిక్కల్ (65), సర్ఫరాజ్ ఖాన్ (56) అర్ధశతకాలు సాధించారు. ఇంగ్లాండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/170) నాలుగు వికెట్లు తీసినప్పటికీ... పరుగులను నియంత్రించలేకపోయాడు. ప్రస్తుతం టీమ్‌ఇండియా 255 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 218 పరుగులకే కుప్పకూలింది.

ఓవర్‌నైట్ స్కోరు 135/1తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్‌కు శుభారంభమే దక్కింది. రెండో వికెట్‌కు రోహిత్, గిల్ ఏకంగా 171 పరుగులు జోడించారు. ఈ క్రమంలో వీరిద్దరూ సెంచరీలు పూర్తి చేశారు. చాలా రోజుల తర్వాత బౌలింగ్‌కు వచ్చిన ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సంధించిన తొలి బంతికే రోహిత్ క్లీన్ బౌల్డయ్యాడు. అయితే, స్వల్ప వ్యవధిలో రోహిత్-గిల్ ఔట్ కావడంతో టీమ్‌ఇండియా ఇబ్బందుల్లో పడినట్లు అనిపించినా కోలుకోగలిగింది. అరంగేట్ర బ్యాటర్ దేవదుత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ అర్ధశతకాలతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. దీంతో తొలి ఐదుగురు బ్యాటర్లు 50కి పైగా స్కోర్లు చేయడం విశేషం. ఇంగ్లాండ్ బౌలర్లు విజృంభించి పడిక్కల్, ధ్రువ్ జురెల్ (15), రవీంద్ర జడేజా (15), రవిచంద్రన్ అశ్విన్ (0)ను ఔట్ చేశారు. వందో టెస్టు ఆడుతున్న అశ్విన్ తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ కావడం గమనార్హం. అయితే, కుల్‌దీప్ యాదవ్-జస్‌ప్రీత్ బుమ్రా క్రీజ్‌లో పాతుకుపోయారు. తొమ్మిదో వికెట్‌కు 108 బంతుల్లో 45 పరుగులు జోడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.